


జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
జన శ్రేయస్సే మా బాధ్యత

సంపుటి : 01 సంచిక : 164 ఎడిటర్ : మార్పు సాయికుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ సోమవారం - 07 - అక్టోంబర్- 2024

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

# పుంగనూరు బాలిక కుటుంబానికి చంద్రబాబు ఫోన్..

- చిన్నారిని హత్య చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం
- హత్య విషయాన్ని వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని అనిత మండిపడ్డారు.
- బాలిక తండ్రితో మాట్లాడిన చంద్రబాబు ధైర్యంగా ఉండాలని చెప్పారు.
- బాధిత కుటుంబసభ్యులను సీఎం ఫోన్‌లో పరామర్శించారు.
- రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు, హత్యలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు,




వారిని వదిలిపెట్టబోమని హామీ..

చిత్తూరు: పుంగనూరు లో ఆస్పియా(7) అనే చిన్నారిని హత్య చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను సీఎం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తండ్రితో మాట్లాడిన చంద్రబాబు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముగ్గురు నిందితులను చిత్తూరు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, చట్టప్రకారం వారికి కఠిన శిక్ష విధిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు.

నిందితులను ఉపేక్షించం..

మరోవైపు పుంగనూరు వెళ్లి బాధిత కుటుంబాన్ని

## ఆయుధాలపై ఆంక్షలు సిగ్గుచేటు..




- గాజాలో పోరాడటానికి ఇజ్రాయెల్‌కు తాము ఆయుధ విక్రయాలను ఆపేస్తున్నామని చెప్పారు.
- గతేడాది అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడుల్లో వేలాది మంది ఇజ్రాయెలి పౌరులు మరణించారు.
- యుద్ధం విద్వేషాలకు దారి తీసిందన్నారు. లెబనాన్ మరో గాజాలా మారకూడదని వెల్లడించారు. మిగతా..2లో

## మూసీ ప్రాజెక్టుపై తేల్చేసిన రేవంత్




- ఎవరు అడ్డుపడినా ప్రాజెక్టు ఆగదని స్పష్టం చేశారు.
- 33 బృందాలతో మూసీ ఏరియాలో అధికారులు సర్వే చేశారని..
- నిర్వాసితులను ఒప్పించే ఖాళీ చేయిస్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు.
- బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే ఇంకా ఈటల నడుస్తున్నారని విమర్శించారు.

## ప్రధాని మోడీకి కేజ్రీవాల్ సవాల్




- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాని మోడీ తరపున ప్రచారం
- వచ్చే ఏడాది సెప్టెంబర్‌తో మీకు 75 ఏళ్లు నిండుతాయి.
- దేశవ్యాప్తంగా డబుల్ ఇంజిన్ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు.
- దేశరాజధాని ఢిల్లీలో శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. మిగతా..2లో

## అదరగొట్టిన బౌలర్లు..




2

- పాకిస్థాన్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో భారత బౌలర్లు అదరగొట్టారు.
- బ్యాటింగ్ ఎంచుకున్న పాక్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు.

దుబాయి: మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో భారత బౌలర్లు అదరగొట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ నిదా దర్ (28) టాప్ స్కోరర్. ఓపెనర్ మునీబా అలీ (17), ఫాతిమా సనా (13), తొమ్మిదో స్థానంలో

## కాంగ్రెస్ మోసాలను నిలదీయండి



రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు బంధును నిలిపివేశారు, రైతు భరోసా దిక్కులేకుండా పోయింది,

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అన్నారు.. పది నెలలు గడిచాయి అతీ గతీ లేదు.

హైదరాబాద్? : గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఒక్కసారి ఆలోచించాలని మాజీ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. మిగతా..2లో

## పుంగనూరు బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం : చంద్రబాబు




బాలిక అచూకి కోసం ఎస్పీ వెంటనే 11 బృందాలను ఏర్పాటు చేశారని వివరించారు.

పుంగనూరులో బాలిక కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

బాలిక కుటుంబ సభ్యులు చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు.

## మరో రెండు రోజులు ఈ రాష్ట్రాల్లో వర్షాలు..




కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రాబోయే 6 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అక్టోబర్ 9 వరకు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని

## ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేస్తాం

పాఠశాలల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాన్సెప్ట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు.

ఒక్కో పాఠశాలకు రూ. 25 నుంచి 26 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు.

ప్రస్తుత రెసిడెన్షియల్ స్కూలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు.



హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాఠశాలల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాన్సెప్ట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లను ఇవాళ(ఆదివారం) విడుదల చేశారు. సచివాలయంలో భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు.

## ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం..




రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

"ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం..

ఇంకోవైపు రైతు భరోసా మోసం..

ముంచే రోజులు పోతాయ్..!! మళ్లీ మంచి రోజులొస్తాయ్'..

## మూసీ నిర్వాసితులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..

హైదరాబాద్‌లో మూసీని అభివృద్ధి చేయొద్దని ప్రతిపక్షాలు అంటున్నాయని

వాళ్ల పిల్లలు చదువుకోవద్దా?, వాళ్లు బాగుపడొద్దా? అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

మూసీ పరివాహక ప్రాంతంలో మొత్తం 10వేల కుటుంబాలు ఉన్నాయని,



హైదరాబాద్: మూసీ విషయంలో ఎవరూ అడ్డుపడ్డా ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ మురికిని ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మూసీని అభివృద్ధి చేయొద్దని ప్రతి పక్షాలు అంటున్నాయని, ఎందుకు చేయొద్దో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మిగతా..2లో

## సీఎం చంద్రబాబుతో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి భేటీ

మాజీ సీఎం, బీజేపీ నాయకుడు ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి భేటీ

చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తిరింది.

ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి.

చంద్రబాబు పాలనపై ఇటీవల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించిన సంగతి తెలిసిందే.

2లో

హైదరాబాద్, అక్టోబర్ 06: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో మాజీ సీఎం, బీజేపీ నాయకుడు ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లోని సీఎం చంద్రబాబు నివాసంలో ఆయనతో మాజీ సీఎం కిరణ్ కుమార్ సమావేశమయ్యారు. మరోవైపు సీఎం చంద్రబాబు సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.



# ప్రధాని మోడీకి కేజ్రీవాల్ సవాల్

మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ : బిజెపి అధికారంలో ఉన్న మొత్తం 22 రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్‌ను ఇస్తే.. వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాని మోడీ తరపున ప్రచారం చేస్తానని ఆప్ చీఫ్ ప్రధాని మోడీకి సవాలు విసిరారు. న్యూఢిల్లీలో ఆదివారం 'జనతా కీ అదాలత్' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం విఫలమైందని, హర్యానా, జమ్ము కాశ్మీర్‌లలో బిజెపి ప్రభుత్వం ఓటమి పాలౌతుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయని అన్నారు. "మోడీజీ మీకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. వచ్చే ఏడాది సెప్టెంబర్‌తో మీకు 75 ఏళ్లు నిండుతాయి. పదవీ విరమణ చేయాల్సి వుంది. ఒక్క ఏడాది మాత్రమే మిగిలి వుంది. మీ ప్రభుత్వ పాలన ఉన్న 22 రాష్ట్రాల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి, ఉచిత విద్యుత్‌ను అందిస్తే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి తరపున ప్రచారం చేస్తాను" అని ప్రధాని మోడీకి సవాలు విసిరారు. దేశవ్యాప్తంగా డబుల్ ఇంజిన్ సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. జూన్‌లో 240 సీట్లు పొందినపుడే ఓ ఇంజిన్ ఫెయిలైందని, ఇప్పుడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రెండో ఇంజిన్ ఫెయిల్ అవుతోంది. డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరియు అవినీతి అని ప్రజలు అర్థం చేసుకున్నారు. అందుకే ప్రజలు బిజెపిని ఓడిస్తున్నాయని అన్నారు. దేశరాజధాని ఢిల్లీలో శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. ఢిల్లీలో పోలీస్ వ్యవస్థ కేంద్ర ప్రభుత్వం తరపున పనిచేస్తోందని, ఆప్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపైనే దృష్టి సారించిందని అన్నారు. ఎల్‌జి పాలన నుండి విముక్తి కల్పించి రాష్ట్రానికి పూర్తి హోదా కల్పిస్తానని అన్నారు.

# కాంగ్రెస్ మోసాలను నిలదీయండి

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోగా, మీ ఊళ్లలో అవ్వాతాతలకు పెంచుతామన్న పింఛన్ పెంచలేదు, రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు బంధును నిలిపివేశారు, రైతు భరోసా దిక్కులేకుండా పోయింది, బోనస్‌ను బోగస్ చేశారు.. అని పేర్కొన్నారు.

దోస్తులతో కలిసి చర్చించండి..

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అన్నారు.. పది నెలలు గడిచాయి అతీ గతీ లేదు. నాలుగు వేల నిరుద్యోగ భృతికి నీళ్లు వదిలారు.. అని వెల్లడించారు. ఈ దసరాకు మీ ఊళ్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలాయ్ - బలాయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాల గురించి చర్చించండని తెలిపారు. మీ ప్రాంతాల్లోని కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలతో పాటు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్‌లపై ఎక్కడిక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు.

# మూసీ నిర్వాసితులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..

మొదటి పేజి తరువాయి

మూసీ పరివాహక ప్రజలు ఆ మురికి ప్రాంతంలో పుట్టి అక్కడే ఉంటున్నారని, వారి భౌవిష్యత్తు తరాలూ అలాగే బతకాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మూసీ ప్రాంత ప్రజలకు మంచి జీవితం ఉండొద్దా?, వాళ్ల పిల్లలు చదువుకోవద్దా?, వాళ్లు బాగుపడొద్దా? అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. వాళ్లందరినీ బాగు చేసే మంచి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో మ్మొత్తం 10వేల కుటుంబాలు ఉన్నాయని, ఆరు నెలల నుంచి ఎన్యుమరేట్ చేయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 33టీమ్‌లను పెట్టి ఇంటింటికీ తిప్పి ప్రతి ఒక్కరి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం అవేర్‌నెస్ ప్రొగ్రామ్‌లో భాగంగా మార్కింగ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎంత వరకూ బఫర్ జోన్ ఉందనేది వివరిస్తున్నామని, నష్టపోయే వారికి పరిహారం ఇవ్వనున్నట్లు నిర్వాసితులకు చెప్తున్నట్లు రేవంత్ తెలిపారు. మూసీలో గుడిసెలు వేసుకున్న పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చి ఆత్మగౌరవంతో బతకాలని చెప్తున్నట్లు పేర్కొన్నారు. బఫర్ జోన్‌లో ఉన్న వారిని ఏ విధంగా ఆదుకోవాలో ఆలోచన చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# అదరగొట్టిన బౌలర్లు..

మొదటి పేజి తరువాయి

వచ్చిన అరూబ్ షా (14లి) పరుగులు చేశారు. భారత బౌలర్ల ధాటికి గుల్ ఫెరోజా డకౌట్‌గా వెనుదిరగ్గా.. సిద్రా అమీన్ (8), ఒమైమా (3), ఆలియా (4)ను సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో శ్రేయంకా పాటిల్ (2/6), అరుంధతి రెడ్డి (3/19) అదరగొట్టారు. రేణుకా సింగ్, దీప్తి శర్మ, ఆశా శోభన తలో వికెట్ పడగొట్టారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఫెరోజాను రేణుకా సింగ్ పెవిలియన్‌కు పంపగా.. తర్వాత మునీబా, సిద్రా కాసేపు నిలకడగా ఆడారు. ఈ క్రమంలోనే దీప్తి శర్మ బౌలింగ్‌లో సిద్రా క్లీన్‌బౌల్డ్ అయింది. కాసేపటికే ఒమైమాను అరుంధతి ఔట్ చేసింది. నిలకడగా ఆడుతున్న మునీబా శ్రేయంకా బౌలింగ్‌లో స్టంపౌట్ కాగా.. ఆలియాను అరుంధతి వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. తర్వాత కూడా భారత బౌలర్లు జోరు కొనసాగించడంతో పాక్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

# ఆయుధాలపై ఆంక్షలు సిగ్గుచేటు..

మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ మధ్య ప్రారంభమైన యుద్ధం క్రమంగా మధ్యప్రాశ్చం మొత్తానికి విస్తరిస్తున్నది. హమాస్, హెజ్‌బొల్లా గ్రూప్‌లను తుదముట్టించడమే లక్ష్యంగా నెతన్యాహూ దళాలు ముందుకు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వేలాది మంద్రి ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఐడీఎఫ్ దాడుల ధాటికి లక్షలాది మంది నిరాశ్రయులై ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ఆయుధ విక్రయాలను నిలిపివేయాలంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పిలుపునిచ్చారు. రాజకీయ పరిష్కారమే కీలకమని భావిస్తున్నట్లు చెప్పారు. గాజాలో పోరాడటానికి ఇజ్రాయెల్‌కు తాము ఆయుధ విక్రయాలను ఆపేస్తున్నామని చెప్పారు. కాల్పుల విరమణ పిలుపును నెతన్యాహు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇది ఇజ్రాయెల్ పొరపాటని, దాని భద్రతపై కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. యుద్ధం విద్వేషాలకు దారి తీసిందన్నారు. లెబనాన్ మరో గాజాలా మారకూడదని వెల్లడించారు. లెబనాన్‌లో సరిహద్దులకు దళాలను పంపాలన్న నెతన్యాహు నిర్ణయాన్ని మాక్రాన్ తప్పుపట్టారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాక్రాన్ నిర్ణయాన్ని ఖండించారు. ఇరాన్ నేతృత్వంలోని అరాచక శక్తులతో ఇజ్రాయెల్ పోరాడతున్నదని, అందువల్ల ఇజ్రాయెల్ వైపు ప్రపంచం నిలవాలన్నారు. కానీ, మాక్రాన్‌తో సహా ఇతర పాశ్చాత్య నాయకులు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరాపై ఆంక్షలు విధించడం సిగ్గుచేటని మండిపడ్డారు. హెజ్‌బొల్లా, హమాస్, హౌతీలపై ఇరాన్ ఆయుధ నిషేధం విధిస్తుందా అని ప్రశ్నించారు. గతేడాది అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడుల్లో వేలాది మంది ఇజ్రాయెలి పౌరులు మరణించారు. అందుకే తాము గాజా, లెబనాన్‌లో పోరాడుతున్నామని చెప్పారు. పాశ్చాత్య దేశాలు తమకు అండగా నిలిచినా.. లేకున్నా ఈ యుద్ధం గెలిచే వరకు ఇజ్రాయెల్ పోరాడుతుందని స్పష్టం చేశారు.కాగా, లెబనాన్ రాజధాని బీరుట్‌లోని ఫ్రెంచ్ బహుళజాతి కంపెనీ టోటల్ ఎనర్జీస్ గ్యాస్ స్టేషన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీంతో స్టేషన్‌లో భారీ అగ్నిప్రాంతం జరిగింది. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి.

# పుంగనూరు బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం : చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



అమరావతి : చిత్తూరు జిల్లా పుంగనూరు లో హత్యకు గురైన బాలిక కుటుంబానికి న్యాయం చేసి ఆదుకుంటామని ఏపీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. బాలిక కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మంత్రులు ఫరూఖ్, రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం నాడు పుంగనూరులో బాలిక కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబ సభ్యులు చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడించారు. ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ సెప్టెంబర్ 29న బాలిక అదృశ్యం కాగా అదే రోజు రాత్రి 11 గంటలకు ఫిర్యాదు చేశారని తెలిపారు. బాలిక అచూకి కోసం ఎస్పీ వెంటనే 11 బృందాలను ఏర్పాటు చేశారని వివరించారు. మూడు రోజుల తర్వాత బాలిక మృతదేహం లభ్యమైందని తెలిపారు. డాక్టర్ల ప్రాథమిక నివేదిక ఆధారంగా బాలికపై అత్యాచారం జరుగ లేదన్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారని వివరించారు. అయితే ఘటనపై జగన్ రాజకీయం చేయడం సరికాదని అన్నారు.

# పుంగనూరు బాలిక కుటుంబానికి చంద్రబాబు ఫోన్..

మొదటి పేజి తరువాయి

ఏపీ హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ధైర్యం కోల్పోవద్దని చెప్పి ఫోన్ ద్వారా సీఎం చంద్రబాబుతో మాట్లాడించారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు, హత్యలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యాచారాలు వంటి ఘటనల విషయంలో నిందితులను ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఆస్పియా హత్య చాలా దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హత్య కేసును జిల్లా పోలీసులు ఛేదించారని, ఈ ఘాతుకానికి పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారని అనిత తెలిపారు. చిన్నారి అదృశ్యమైందని ఫిర్యాదు అందిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు 12బృందాలుగా ఏర్పడి బాలిక కోసం గాలించారని ఆమె చెప్పారు.

## రాజకీయాలు చేయ్యొద్దు..

దురదృష్టవశాత్తూ ఆస్పియా ప్రాణాలు కాపాడలేకపోయారని హోంమంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ విచారణ చేపట్టి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. ఆస్పియా హత్య విషయాన్ని వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని అనిత




మండిపడ్డారు. ఇలాంటి విషయాలనూ వారు రాజకీయాలకు వాడుకోవడం సిగ్గచేటని అన్నారు. వైసీపీ హయాంలో వందలమందిపై అత్యాచారాలు జరిగాయని ఆమె ఆరోపించారు. ఆ సమయంలో మాజీ సీఎం జగన్ ఒక్క రోజైనా తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చారా? అంటూ ప్రశ్నించారు. కానీ ఇప్పుడు మాత్రం బాలిక హత్య కేసును వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చిన్నారిపై అత్యాచారం జరగలేదని, ఆమె శరీరంపై చిన్న గాయం కూడా లేదన్నారు. ఈ విషయంలో పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైందని హోంమంత్రి చెప్పారు.

## అసత్య ప్రచారం ఆపండి..

చిన్నారి హత్య అత్యంత బాధాకరమని ఏపీ రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబు అండగా ఉంటారని మంత్రి భరోసా ఇచ్చారు. వారికి భరోసా కల్పించేందుకే పుంగనూరు వచ్చినట్లు ఆయన తెలిపారు. బాలికపై ఘాతుకానికి పాల్పడిన నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని మంత్రి చెప్పారు. మహిళలు, చిన్నారులపై దాడులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. ఇలాంటి ఘటనలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. చిన్నారి ఆస్పియా హత్యను వైసీపీ నేతలు రాజకీయం చేయడం బాధాకరమని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలనూ వారు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం జరిగిందంటూ అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చిన్నారిపై లైంగిక దాడి జరగలేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

# సీఎం చంద్రబాబుతో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి భేటీ

మొదటి పేజి తరువాయి

ప్రస్తుత సీఎంతో మాజీ సీఎం భేటీపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఎందుకంటే.. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుతో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో ఆంధ్ర ఓటరు కూటమికి పట్టం కట్టారు. దీంతో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తిరింది. ఇక ఇదే ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లా రాజంపేట లోక్ సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేసి.. ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మిథున్ రెడ్డి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక చంద్రబాబు పాలనపై ఇటీవల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించిన సంగతి తెలిసిందే. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతోపాటు రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే బీజేపీ నేత, మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి వివిధ సందర్భాల్లో ప్రకటించిన విషయం విధితమే. అయితే చంద్రబాబు రేపు ఢిల్లీ వెళ్తున్నున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పోలవరం, అమరావతి నిర్మాణం కోసం ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై సీఎం చంద్రబాబుతో మాజీ సీఎం కిరణ్



కుమార్ రెడ్డి చర్చించినట్లు సమాచారం.

## ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేస్తాం

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండప్స్‌తో 20-25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కిల్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఒక్కో పాఠశాలకు రూ. 25 నుంచి 26 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు పక్కా భవనాలు లేక అద్దె భవనాలు ఉన్నాయని చెప్పారు. ఒకటోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే దగ్గర బోధన చేస్తున్నారని అన్నారు. గత మూడు నెలలుగా రెసిడెన్షియల్ స్కూళ్లపై కసరత్తు చేశామన్నారు. ప్రస్తుత రెసిడెన్షియల్ స్కూలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. 662 స్కూళ్లకు పక్కా భవనాలు లేవని అన్ని అద్దె భవనాలేనని చెప్పారు. ఈ ఏడాది 5 వేల కోట్ల రూపాయలు రెసిడెన్షియల్ స్కూళ్లకు ఖర్చు చేస్తామని అన్నారు. కులమత, లింగ భేదం లేకుండా రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఉంటాయని స్పష్టం చేశారు. పేద పిల్లలు తాము ఏదో మిస్సవుతున్నామని అనుకోకూడదని అన్నారు. అవసరమైతే ప్రతీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్మాల్ థియేటర్ కడుతామని అన్నారు. ఈనెల 11న సాధ్యమైనన్ని పాఠశాలలకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇప్పటికే 24 నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక పూర్తయిందని అన్నారు. వీలైనంత త్వరగా ప్రతీ నియోజకవర్గంలో ఒక రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. 7 నెలల్లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల నియామకం సొసైటీ ద్వారా జరుగుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మూసీ ప్రాజెక్టుపై తేల్చేసిన రేవంత్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్: మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ముందుకే వెళతామన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. మూసీ నది ప్రక్షాళన చేయాలను కుంటున్నామని.. ఎవరు అడ్డుపడినా ప్రాజెక్టు ఆగదని స్పష్టం చేశారు. మురికిలో కూరుకుపోయిన మూసీ నదిని ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదని ప్రశ్నించారు. మూసీ బాధితులంతా మురికిలోనే బతకాలా? వాళ్ల జీవితాలు బాగుపడొద్దా? అని సీఎం రేవంత్ నిలదీశారు. 33 బృందాలతో మూసీ ఏరియాలో అధికారులు సర్వే చేశారని.. నిర్వాసితులను ఒప్పించే ఖాళీ చేయిస్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు. విలువైన మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుపై సలహాలు ఇవ్వకుండా.. విమర్శలు చేయడం ఏంటని ప్రతిపక్షాలపై మండిపడ్డారు. 20 ఏళ్లుగా తాను రాజకీయాల్లో ఉన్నానని.. తనకు పేదోడి బాధ తెలియదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసిందని.. మరో రూ. 10 వేల కోట్లు అప్పు చేసి మూసీ బాధితులను ఆదుకోలేమా? అని రేవంత్ నిలదీశారు. తప్పకుండా మూసీ మంచి చోట ఆశ్రయం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మీరు చేసిన అవినీతిని ఆపితే పేదలను ఆదుకోవచ్చని



బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎంపీ ఈటల రాజేందర్ చొక్కా మార్చాడు కానీ.. ఇంకా పాత అంగీ వాసన పోలేదన్నారు రేవంత్. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే ఇంకా ఈటల నడుస్తున్నారని విమర్శించారు. ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్మించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్ల రిజర్వాయర్లలో ఎవరి భూములు పోలేదా? అని రేవంత్ నిలదీశారు. మల్లన్న సాగర్ కింద రైతులను కొట్టి, బలవంతంగా ఖాళీ చేయించారన్నారు. మూసీ నిర్వాసితులను రెచ్చగొడుతున్న కేసీఆర్ కుటుంబం వాళ్ల కోసం ఏమైనా చేసిందా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. పేదలను రెచ్చగొట్టకుండా.. మూసీ నిర్వాసితులను ఎలా ఆదుకుందామా అని సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రతిపక్షాలకు హితవు పలికారు. మరోవైపు, కేసీఆర్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు రేవంత్. కాళేశ్వరం కేసీఆరే కట్టారు..ఆయన కళ్ల ముందే కూలిందన్నారు. కాళేశ్వరానికి ఇప్పటి వరకు డీపీఆర్ లేదన్నారు. లక్షా 50 వేల కోట్ల అంచనాతో ప్రాజెక్టు కట్టారన్నారు. మల్లన్నసాగర్ లో 50 టీఎంసీలు నింపితే కూలిపోతుందని. .నిపుణుల కమిటీ తేల్చిందని సీఎం రేవంత్ తెలిపారు.

# మరో రెండు రోజులు ఈ రాష్ట్రాల్లో వర్షాలు..

మొదటి పేజి తరువాయి

దేశవ్యాప్తంగా రుతుపవనాలు వెనక్కి తగ్గినప్పటికీ ఇంకా పలు రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అక్టోబరు 7 నుంచి 11వ వరకు ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో రేపు (అక్టోబర్ 7న) ఢిల్లీ, నోయిడా, ఫరీదాబాద్‌తో సహా లోని వివిధ ప్రాంతాలలో చిరుజల్లులు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది.

వాయుగుండం

నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వెంబడి వాయుగుండం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో యూపీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో దీని ప్రభావం కనిపిస్తుందని వెల్లడించింది. పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ ప్రభావం అక్టోబర్ 7, 8 తేదీల్లో యూపీ, బీహార్‌లోని కొన్ని జిల్లాల్లో కనిపిస్తుందని ఐఎండీ వెల్లడించింది.

కేరళతోపాటుజి

దీంతోపాటు అక్టోబర్ 7 నుంచి 10 మధ్య ఆగ్నేయ అరేబియా సముద్రం మీదుగా కేరళ తీరం చుట్టూ, లక్షద్వీప్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, కర్ణాటక ప్రాంతాల్లో కూడా వర్షాలు కురియనున్నట్లు వెదర్ రిపోర్ట్ తెలిపింది. నైరుతి బే, ఉత్తర బెంగాల్, తమిళనాడు తీరానికి సమీపంలో బలమైన గాలులు వీస్తాయని చెప్పింది. ఇది కాకుండా గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఈ ప్రాంతాల్లో కూడా..

వాతావరణ శాఖ వెబ్‌సైట్ ప్రకారం అరుణాచల్ ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో రాబోయే 6 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో పాటు అస్సాం, మేఘాలయలో కూడా భారీ వర్షాలు కురుస్తాయి. అదే సమయంలో అక్టోబర్ 7న నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపురలో కూడా వర్షాలు కురిస్తాయని వెదర్ రిపోర్ట్ ప్రకటించింది.



## తెలుగు రాష్ట్రాల్లో

ఇదే సమయంలో బంగాళాఖాతంలో మరో రెండు అల్పపీడన ద్రోణులు ఏర్పడుతున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో వచ్చే 24 గంటల్లో ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురియనున్నట్లు అంచనా వేసింది. ఇక తెలంగాణలో సైతం వచ్చే రెండు రోజులు వానలు కురుస్తాయని ఐఎండీ చెప్పింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అక్టోబర్ 9 వరకు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వెదర్ రిపోర్ట్ అంచనా వేసింది.

# ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం..

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ వేదికగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారని, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారని, ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ రెడ్డి సర్కారే కారణమని అన్నారు. "ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం.. ఇంకోవైపు రైతు భరోసా మోసం.. కౌలు రైతులకూ అందని సాయం" అంటూ విమర్శించారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం నెలకొందన్నారు. వందలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి లేదని.. ప్రభుత్వానికి బాధ్యత లేదని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దసరా పండుగ వేళ.. వ్యవసాయాన్ని దండగలా మార్చిందని.. సీఎం రేవంత్ రెడ్డికి రైతన్నల చేతిలో దండన తప్పదని అన్నారు. 'అన్నదాతలారా ఆత్మస్థైర్యం కోల్పోకండి..! ముంచే రోజులు పోతాయ్..!! మళ్లీ మంచి రోజులొస్తాయ్'..!!! జై కిసాన్ అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? ... రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? అని కేటీఆర్ ప్రశ్నిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2500, అవ్వ, తాతలకు నెలకు రూ. 4000 ఇస్తా




అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? అని ప్రభుత్వంపై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. మూసీ సుందరీకరణ పేరిట రూ. లక్షన్నర కోట్లు లూటీకి తెరతీసిన ఘనుడు ఎవరు? అని ధ్వజమెత్తారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకోవాల్నా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం..? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా ఈ ముఖ్యమంత్రికి? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

## సంగటి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న దద్దాల

### దద్దాలకు ఘన స్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు



కనిగిరి (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : సియస్ పురం మండలం అరివేముల పంచాయతీలో సంగటి భాస్కర్ మరియు మేరిల వివాహము ఆదివారం జరిగింది. ఈ కార్య క్రమానికి కనిగిరినియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వధు, వరులను ఆశీర్వాదించారు. వధు, వరుల కుటుంబ సభ్యులతోపాటు దద్దాల ఆ గ్రామ వైసీపీ నాయకులు దద్దాల నారాయణ యాదవ్ కు ఘనస్వాగతం పలికారు. ఈ వివాహ వేడుకల్లో మండలంపార్టీ కన్వీనర్ భువనగిరి వెంకటయ్య,వైసీపీ నాయకులు ప్రకాష్ రెడ్డి, కే.నారాయణ, అన్నేబోయిన గురురాజా,బక్కా దేవదానం, బక్కా దేవరాజు, బక్కా భాగ్యరాజు, ఈశ్వరయ్య, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, హనుమంతునిపాడు మండల నాయకులు ఆదినారాయణ రెడ్డి, వాకమళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ఆలయ ఫౌండేషన్ వారిచే నిర్వహించబడిన కంటి శిబిరం విజయవంతం......



రామగుండం (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) :గోదావరిఖని ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మధ్యప్రదేశ్ కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరిఖని 32వ .డివిజన్ కార్పొరేటర్ అయిత శివకుమార్ ఆధ్వర్యంలో... ఆదివారం కంటి పరీక్షల క్యాంపులు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా పరికిపండ్ల రాము, విజయనంద్, ఆర్ జీవన్ జీఎం లలిత్ కుమార్ లు హాజరైనారు. సుమారుగా 400 ల మంది పేషంట్లను పరిశీలించారు. పరికిపండ్ల రాము మాట్లాడుతూ, కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఈనెల మూడవ వారంలో, హైదరాబాద్ లోని శంకర్ విజన్ హాస్పిటల్ లో ఆపరేషన్స్ చేయించడం జరుగుతుందని వారు అన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, దాదాపుగా 15 రోజుల నుండి ఈ కార్యక్రమాన్ని ఆలయ ఫౌండేషన్ నిర్వహించాలని సంకల్పంతో, ప్రతి ఒక్కరు కష్టపడి సోషల్ మీడియాలో, పత్రిక రూపంలో మీడియా పరంగా ప్రచారం చేయడం వల్ల ఇంత విజయవంతం చేసుకోగలిగామని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆలయ ఫౌండేషన్ సభ్యులకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు పల్లె క్రాంతి, రవి వర్మ, నాగరాజు, పడాల రాజ్ కుమార్ ,బద్రి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ ముత్యాలమ్మా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం



జీలుగు మిల్లి (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ఏలూరు జిల్లా జీలుగుమిల్లి.. మండలంలోని తాటి ఆకుల గూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు మరియు ముత్యాలమ్మ సేవ నిర్వహించారు. విగ్రహ దాతలు జనసేన జిల్లా కార్యదర్శి గద్ద మనుగు రవికుమార్ గీత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు చేపడుతున్నామని అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనమా రాంబాబు జనసేన గ్రామ ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు గంధం వెంకటేశ్వర రావు గ్రామస్తులు గ్రామ పెద్దలు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవారు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

### -హెల్మెట్ తప్పని సరిగ ధరించాలి

### - ప్రజలకు అవగాహన కలిపించిన ఎస్సై టి. శ్రీరాం



కనిగిరి (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : గ్రామాలలో కొత్తవారు సంచరిస్తే వెంటనే తమకు తెలియ జేయాలని కనిగిరి ఎస్సై టి. శ్రీరాం తెలిపారు. ఆదివారం కనిగిరి మండలంలోని ఉస్తుంవారిపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిభందనలు పాటించాలని లేనిచో కఠిణచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ దరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించరు. గ్రామాలలో పాత కక్షలు మనసులో పెట్టుకొని గొడవలు సృష్టించేవారిపై కఠిణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై తోపాటు కనిగిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## కృష్ణమూర్తి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి



నందలూరు, (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా 4 వ రోజు ఆదివారం నాడు కృష్ణమూర్తి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బందాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల దాడి కేసులు వైసీపీ కార్యకర్త మృతి



రేపల్లె (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : టిడిపి నాయకుల దాడి కేసులు వైసీపీ కార్యకర్త మృతి చెందిన సంఘటన నియోజకవర్గంలోని నగరం మండలం దాసర పాలెం లో చోటుచేసుకుంది . వివరాల్లోకి వెళితే శనివారం గోడపాటి వారి పాలెం పొలాల్లో టిడిపి నాయకులు నున్నభూషయ్య47 ను టిడిపి నాయకులు గాయపరచడంతో భూషయ్య కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ విశాలకు చికిత్స కోసం తరలించారు చికిత్స పొందుతూ శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతి చెందాడు రూరల్ సీఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు పోస్టార్టం గుంటూరు లో నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకూ అప్పగించడం జరుగుతుందని పోలీసులు తెలియజేశారు

# మైనర్ బాలికపై మరో ఆగంతకుడి అత్యాచారం

### -తెలంగాణ ప్రభుత్వం నిందితుడిని కఠినంగా శిక్షించాలి

### -కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అయిలయ్య కురుమ



కరీంనగర్,(అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : అభం శుభం తెలియని మరో ఆడబిడ్డపై అత్యాచారం జరిగిన సంఘటన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కలకలం రేపింది.గొర్రెల కాపరి కూతురు 11 సంవత్సరాల మైనర్ బాలికపై 20 సంవత్సరాల ధుర్మగుడు అఘాయిత్యం అత్యాచారం చేయడం అన్యాయం ఆమానుషం. ఇలాంటి తప్పులు చేసే దుర్మార్గులను వెంటనే ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, మళ్లీ ఇలాంటి తప్పులు చేయాలంటే ఆగంతకులకు వెన్నులో వణుకు పుట్టేలా ఆ శిక్షలు ఉండాలని కడారి అయిలయ్య కురుమ అన్నారు.కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి కడారి అయిలయ్య ఆధ్వర్యములో జిల్లా కురుమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగింది.సమావేశంలో కడారి అయిలయ్య కురుమ మాట్లాడుతూ...ఇటీవల వారం రోజుల క్రితం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కురుమ గొర్రెల కాపరి కూతురు 11 సంవత్సరాల మైనర్ బాలికపై 20 సంవత్సరాల ధుర్మగుడు అఘాయిత్యం అత్యాచారం చేయడం జరిగి%శీ%దని ఇట్టి సంఘటనను జిల్లా కురుమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.ఈ పాపకు జరిగిన అన్యాయం సోషల్ మీడియాలో రాష్ట్రవ్యాప్తంగా,దేశవ్యాప్తంగా కూడా వైరల్ అయిందని కాబట్టి అతి త్వరలోనే ఈ దుర్మార్గునికి కఠిన శిక్ష విధించాలన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటన ఏ కులంలో గాని, ఏ మతంలో గాని జరగకూడదని సభ్య సమాజమంతా తీవ్రంగా ఖండించాలన్నారు. ఇలాంటి సంఘటణ ఇతర దేశాలలో జరిగితే బహిరంగంగానే ఉరి తీయడమా లేక తల నరకడమా,గన్ తో షూట్ చేయడమా లేక రాళ్లతో కొట్టి చంపడమా జరుగుతున్నారు. కానీ మన దేశంలో మరి విచారణ పేరుతో నెలలు , సంవత్సరాలు గడుస్తుందన్నారు. అలాకాకుండా అతి త్వరలోనే కఠిన శిక్ష విధిస్తే ఇలాంటి దుర్మార్గులు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా ఉంటారని, మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మన తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కురుమ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.అలాగే స్థానిక గ్రామానికి చెందిన యువకులు కుల మతాలకు అతీతంగా ఏకమై అమ్మాయికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించినందుకు కొంత మందిపై కేసులు పెట్టారని తెలిందని ఇలాంటి కేసులను రద్దు చేయాలన్నారు. ఇలాంటి నిందితుని త్వరలోనే కఠినంగా శిక్షించినప్పుడే మన సమాజంలోని ఆడపిల్లలకు, స్త్రీలకు రక్షణ ఉంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఆలోచన రావాలంటేనే భయపడే విధంగా శిక్ష విధిస్తే ఇలాంటి సంఘటనలు జరగవన్నారు.ఈ సమావేశంలో కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎలుకపెల్లి లచ్చయ్య కురుమ, జిల్లా ఉపాధ్యక్షులు యేగుర్ల అశోక్ కురుమ, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నరసయ్య కురుమ, పోలె గట్టయ్య కురుమ, ట్రస్ట్ అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, పంచాయతీ కమిటీ జిల్లా అధ్యక్షులు కోరే గట్టయ్య కురుమ, విద్యా కమిటీ జిల్లా అధ్యక్షులు పోలె శ్రీనివాస్ కురుమ, జిల్లా కురుమ మహిళా విభాగం అధ్యక్షురాలు కర్రే పావని కురుమ, కురుమ వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు మీస బీరయ్య కురుమ, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు శెవ్వాళ్ల అక్షయ్ కురుమ, ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దయ్యాల బీరయ్య కురుమ,కర్రే రవి కురుమ, గుంట అజయ్ కురుమ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఏపీలో ఆర్టీసీ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన కొనకళ్ల నారాయణలి

### కొనకళ్ళ నారాయణను అభినందిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని



రేపల్లె (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ఏపీ ఆర్టీసీ ఛైర్మన్ గా కొనకళ్ల నారాయణ బాధ్యతలు స్వీకరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ వ్యాపార సంస్థ కాదు. ప్రజా సంస్థ. ప్రజలపై భారం వేయకుండా కార్గో ద్వారా ప్రభుత్వ ఆదాయంను పెంచు కుంటాం.అలాగే ఆర్టీసీలో కార్గో రవాణాను మరింత అభివృద్ధి చేస్తాం" అని పేర్కొన్నారు. రేపల్లె శాసనసభ్యులు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణనం అభినందించారు ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధితోపాటు పార్టీ బలోపేతానికి కూడా శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన సూచించారు కొనకళ్ల నారాయణ కు సినీ నటుడు సుమన్, మంత్రులు, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు

## వీఆర్ఏ పేర్లు రామయ్య అనారోగ్యంతో మృతి



రేపల్లె (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) :నిజాంపట్నం గ్రామానికి చెందిన పేర్లి రామయ్య 85 అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు ఈయన నిజాంపట్నం తాసిల్దార్ కార్యాలయంలో గత 50 సంవత్సరాల నుండి మోతాద గా విధులు నిర్వహిస్తూ గత కొన్ని సంవత్సరాలు నుండి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం సాయంత్రం తన స్వగృహంలో మృతి చెందాడు. ఈయన మృతి పట్ల తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు

## బాధితులకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి చేయూత



రేపల్లె (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికలలో టిడిపి అధికారం చేపట్టిన నాటినుండి వైసీపీ కార్యకర్తలపై దాడులు నిర్వహించడం జరిగిందని రేపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ ఈ ఊరు గణేష్ అన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంతో వైసీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులు నిర్వహించి కార్యకర్తలను గయపరచటం ఆస్తులను దాంసం చేయడం వంటి కార్యక్రమాలు ఎన్నో జరిగాయని తెలియజేశారు. ఈ విషయం అధిష్టాన దృష్టికి వెళ్లడంతో స్పందించిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాధితులకు చేయూతను అందించేందుకు నగదును చెక్కు రూపంలో అందించారని ఇది ఎంతో అభినందనలు ఏమన్నారు ఆదివారం రేపల్లె చెరుకుపల్లి మండలాల్లో టిడిపి నాయకులు కార్యకర్తలు చేతుల్లో దెబ్బలు తిన్న వైసిపి కార్యకర్తలను ఆదుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేయూతను అందించడం జరుగుతుంది అన్నారు బాధితులకు వైద్య ఖర్చు ల నిమిత్తం కొంత నగదును అందించారని తెలియజేశారు నియోజకవర్గంలో ఆరుగురు బాధితులకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు వంతు న చక్కులను అందించడం జరిగిందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు

## కల్తీ యాసిడ్ టాస్క్ ఫోర్స్, నవాబ్ పేట్ పోలీస్ అధికారులు దాడులు...!!

### 180కల్తీ యాసిడ్ బాక్సులు.. అశోక్ లేలాండ్ వాహనం స్వాధీనం...!!





వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : నవాబుపేట మండలం పరిధిలోని మూలమడ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో అక్రమంగా తయారు చేస్తున్న సుమారు 180 నకిలీ బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిల్స్ కాటన్లను ట్రాస్క్ ఫోర్స్ పోలీసులు,నవాబ్ పేట్ పోలీసులు పట్టుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మూలమడ గ్రామంలో చోటుచేసుకుంది.నవాబుపేట ఎస్సై కే అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఒకే సారి పెద్ద మొత్తంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో మూలమడ గ్రామానికి చెందిన బంట్వారం భోజిరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి వయసు 50.. సంవత్సరాలు ఆయనతోపాటు రవి కిరణ్.తన ఇంట్లో నకిలీ బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో ట్రాస్క్ ఫోర్స్ పోలీసులు,నవాబుపేట్ పోలీసులు వారి ఇంటిపై దాడులు జరిపి సుమారు180 కాటన్ బాక్స్ లో ఉన్నాయినకిలీ.బ్యాటరీ డిస్టిల్డ్ వాటర్ బాటిల్స్ కాటన్లను,టీఎస్ 34టి 7010 నెంబర్ గల అశోక్ లీలాండ్ డ్రైవర్ రవి కిరణ్ తండ్రి బుచ్చయ్యవాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్కుతరలించడం జరిగిందని అన్నారు.ఈ వాటర్ ను ఖాళీ బాటిల్స్ లో నింపి తాండూర్,తదితర ఆటోమొబైల్స్ దుకాణాలు అధికంగా ఉండే చోట అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు.మొత్తంఈ స్వాధీనం చేసుకున్న (సొత్తు) బ్యాటరీ వాటర్ బాటిళ్లమొత్తం 180.. డబ్బా బాక్స్ లో కలిపి మొత్తం బాటిళ్లు 2250. బాటిళ్లు..ఒక్కబాటిల్ ఖరీదు 40 రూపాయలు. విలువ ఉంటుంది మొత్తం 2250 బాటిల్ ఖరీదు విలువ రూ.90వేలు ఉంటుందని ఎస్సై అరుణ్ కుమార్ అన్నారు. అక్రమ బ్యాటరీ వాటర్ తయారు చేస్తున్న బంట్వారం భోజిరెడ్డి వాహన యజమాని రవికిరణ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునమన్నారు.ఎవరైనా అక్రమ వ్యాపారం,వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ భోజిరెడ్డిపై. మరియు వెహికల్ డ్రైవర్ రవి కిరణ్ పై కేసు నమోదు చేస్తున్నట్లుఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.



## అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం



రేపల్లె (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలో వివిధ దేవాలయాల్లో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ భ్రమరాంబ చిన్న మల్లేశ్వర స్వామి దేవాలయం శ్రీ స్వయంభు రామలింగేశ్వర స్వామి దేవాలయం విగ్నేశ్వర స్వామి దేవాలయం గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి దేవాలయం పాతపట్నంలో ఉన్న శివాలయం ఆవరణలో ఉన్న అమ్మవార్లకు అర్చక స్వాములు అన్నపూర్ణాదేవిగా అలంకరణ చేశారు భక్తులు దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఆ దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు

## 6 లక్షల 30 వేల కరెన్సీ తో అమ్మవారికి అలంకరణ





అమరచింత వనపర్తి జిల్లా (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : దేవీ నవరాత్రి ఉత్సవాలు అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణ నగర్ కాళికాదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని ఆరు లక్షల 30000 రూపాయల కరెన్సీ తో అలంకరించారు. కాలనీవాసులు దేవాలయానికి పెద్ద ఎత్తున చేరుకొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీవి నవరాత్రి ఉత్సవాలలో పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. పట్టణంలోని విగ్నేశ్వర భవాని నగర్ సంతోష్ నగర్ జగన్ వాడలో దుర్గామాతకు ప్రతిరోజు భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## కోర్స్ బాలకృష్ణ ఆధ్వర్యంలో బండారు ముత్యాలమ్మా తల్లి మహోత్సవం ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బోరాగం శ్రీనివాస్ హాజరు





జీలుగు మిల్లి (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ఏలూరు జిల్లా జీలుగుమిల్లి.. మండలంలోని టి .గంగన్నగూడెం గ్రామంలోని శ్రీ బండారు ముత్యాలమ్మ మహోత్సవం కార్యక్రమం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా శ్రీ బొరగం శ్రీనివాస్ హాజరయ్యారు. ముత్యాలమ్మ సేవ నిర్వహించారు అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ తల్లి అని ఆయన అన్నారు. అనధికారకంగా వస్తున్న గిరిజన సాంప్రదాయాలను ఆదివాసీల పూర్వీకుల నుండి ఎంతో వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చుకుంటారని ఆయన అన్నారు.ఈ సాంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ గిరిజన గ్రామాల్లో ముత్యాలమ్మ అమ్మవారి మహోత్సవం జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెద్ద కాపు చిన్నారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## రామడుగులో భవాని బోనాల పండగ...



రామడుగు,(అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : రామడుగు మండల కేంద్రంలోని యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో దుర్గ భవాని బోనాలతో ఊరేగింపు కనుల పండగ చేశారు. ఈ సందర్భంగా కురుమవాడ నుండి దుర్గ భవాని మండపం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటికి బోనం చొప్పున ఊరేగింపుగా బయలుదేరి పోచమ్మ గుడి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. దుర్గ భవాని అమ్మవారు వేషధారణలతో పాటు మహిళలు సంస్కృతిక నృత్యాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఊరంతా సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# దారి దోపిడీ దొంగలు అరెస్ట్

-దారికాసి బెదిరించి చోరీలు

-ప్రెస్ మీట్ లో వివరాలు వెల్లడించిన

డి.ఎస్.పి జగదీష్ నాయక్



వేటపాలెం (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : రాత్రి వేళల్లో కాపు కాసి బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చీరాల ఇన్చార్జి డిఎస్పి పి జగదీష్ నాయక్ తెలిపారు ఆదివారం వేటపాలెం పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి కేసు పూర్వపరాలను వివరించారు నాగులపాడు మండలం మద్దిరాల పాడు గ్రామానికి చెందిన షాలెం రాజు అమ్మని తీసుకురావడానికి చిరాల రైల్వే స్టేషన్ కు బయలుదేరి 30/09/2024 అర్ధరాత్రి సుమారు రెండున్నర గంటల సమయంలో కడవకుదురు రైల్వే గేటు దాటిన తర్వాత టాయిలెట్ పోసుకోవడానికి బండి ఆపి వేళ గా అదే సమయంలో ఐదుగురు దొంగలు పొన్నూరు అనసర కాలవ కట్ట నేతాజీ నగర్ 16వ వార్డుకు చెందిన షేక్ మదర్ , ఒంగోలు కొప్పోలు రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన దేవరకొండ మదన్ సాయి, బాపట్ల ఉప్పరపాలెం అంబేద్కర్ నగర్ కి చెందిన చేగుడి ఆనందబాబు, బాపట్ల బేతన్ కాలనీ కి చెందిన శీలం వంశీకృష్ణ, బాపట్ల టౌన్ పోలేరమ్మ చెట్టు శారదాపురి కాలనీకి చెందిన షేక్ సైదా లు రెండు బైకులు పై వచ్చి అతనిని బెదిరించి ఇనుపరాడు చూపించి స్మార్ట్ ఫోన్ బండిని కూడా దొంగిలించికి వెళ్లిపోయారు వేటపాలెం ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు ఈ దొంగతనం కేసు ఛేదించడానికి మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు 5-10- 2024 తేదీన రాత్రి రెండు గంటల సమయంలో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు విశ్వాసనియ్య సమాచారం మేరకు 216 జాతీయ రహదారిపై ఉన్న గాయత్రీ బిర్యానీ పాయింట్ వద్ద చేరుకొని నాలుగు మోటర్ సైకిల్ ఆపి నలుగురు వ్యక్తులు మాట్లాడుకుంటూ ఉండగా పోలీసు జీబు చూసి పారిపోవుటకు ప్రయత్నించగా సిబ్బంది సహాయంతో పట్టుకొని విచారించారు దొంగతనం కేసులో ముద్దాయిలుగా నిర్ధారించి అరెస్టు చేశారు ఏ వన్ ముద్దాయి అయినా షేక్ మదర్ పై 29 కేసులు ఎటు ముద్దాయి దేవరకొండ మదన్ సాయి రెండు కేసులు %ఖ%3 ముద్దాయి చేగుడే ఆనందబాబు పై 11 కేసులు ఏ4 ముద్దాయి సలీం వంశీకృష్ణ పై రెండు కేసులు ఏ ఫైవ్ ముద్దాయి షేక్ సైదా పై ఐదు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు ఏ ఫైవ్ ముద్దాయి షేక్ సైదా పరారీలో ఉన్నాడని చెప్పారు గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు వివరించారు ముద్దాయిలు వద్ద నుండి 22 మొబైల్ ఫోన్లు ఒక ట్యాబ్ బైకులు మొత్తం మీద నాలుగు లక్షల 13 వేల రూపాయలు విలువగల ఐదు బైకులు మొత్తం మీద స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన చాలా రూరల్ సీఐ పీ శేషగిరిరావు వేటపాలెం ఎస్సై ఎం వెంకటేశ్వర్లు పోలీస్ కానిస్టేబుల్ లను డిఎస్పి జగదీష్ నాయక్ అభినందించారు

## జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు రబీ పంటల పై శిక్షణా కార్యక్రమం..



బనవాసి (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి నందు మంగళవారం ఉదయం 10:00 గంటలకి రబీ పంటలు శనగ, కుసుమ, జొన్న మొదలగు పంటల పై జిల్లా వనరుల కేంద్రం, కర్నూలు వారి సహకారంతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే సమన్వయ కర్త రాఘవేంద్ర తెలియచేశారు. కావున రబీ సీజన్ లో పంటలు పండించే రైతులు తప్పకుండా కార్యక్రమంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

## రుణమాఫీ రైతులను ఆదుకోవాలి

### బేగరి అనంతయ్య పల్లె శంకర్ పల్లి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి చేవెళ్ల (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్పల్లి మండల పరిధిలోని పల్లె శంకర్పల్లి గ్రామ నివాసి అయినటువంటి బేకరీ అనంతయ్య ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా చూడాలని అనంతయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లాలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వము ఆదుకోవాలని ఆయన అన్నారు. గతంలోని ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసినట్లయితే రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగాఉంటారని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనిరైతులకు రుణమాఫీ కాలేదనిఆయన అన్నారు. మీరు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోఇందిరాగాంధీ ఇచ్చిన ఇండ్లు భూములు దళితులు అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఇందిరాగాంధీ ఆయంలో ఉన్నటువంటి హామీలుఇప్పుడు సోనియాగాంధీ ఆదివారం లోపల లేకపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దానిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికూడా తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఇండ్లు బొమ్మలు ఇవ్వాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యా రేవంత్ రెడ్డి గత పది సంవత్సరాల జీతం ఉన్నటువంటి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి పేద ప్రజలను ఆదుకున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం. మరి ఇప్పుడు ఎందుకు 11వ లేదో మీరే ఆలోచించవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. చేదోడు వాదోడుగా ఉన్నటువంటి టిఆర్ఎస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. వారి దృష్టిలో పెట్టుకొని ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందనికాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం 150 సంవత్సరాల ఆధ్వర్యంలో ఉన్నటువంటి మాట తప్పని కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలను ఆదుకోవాలనిఆయన అన్నారు.శంకరపల్లి మండల పరిధిలోని దళిత పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండాలనిఆయన కోరినారు.

## రాష్ట్ర ట్రాకర్ చైర్మన్ బోరాగం శ్రీనివాస్ కు శు భాకాంక్షలు తెలుపుకున్న కొల్లి వారిగూడెం టిడిపి నాయకులు వాసిరెడ్డి నాని



టి నరసాపురం (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ ట్రికార్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన బోరాగం శ్రీనివాస్ ను విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ కొల్లి వారి గూడెం గ్రామం అధ్యక్షులు వాసిరెడ్డి నాని మర్యాదపూర్వం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సన్మానించి శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ బోరాగం శ్రీనివాస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని కష్టానికి తగిన ఫలితం త్యాగానికి ప్రతిఫలంగా సీఎం చంద్రబాబు నాయుడు షెడ్యూల్ తెగల సహకార సంస్థ ట్రికర్ చైర్మన్ గా నియమించడం పోలవరం నియోజకవర్గంలో నాయకులకు కార్యకర్తలకు ఎంతో సంతోషంగా ఉందని వాసిరెడ్డి నాని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి వారి గూడెం గ్రామం టిడిపి నాయకులు మక్కినవారిగూడెం నాయకులు ఎన్టీఆర్ అభిమానులు.

## రుణమాఫీ రైతులను ఆదుకోవాలి

### బేగరి అనంతయ్య పల్లె శంకర్ పల్లి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి చేవెళ్ల (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్పల్లి మండల పరిధిలోని పల్లె శంకర్పల్లి గ్రామ నివాసి అయినటువంటి బేకరీ అనంతయ్య ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకునే విధంగా చూడాలని అనంతయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లాలోని రైతులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వము ఆదుకోవాలని ఆయన అన్నారు. గతంలోని ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసినట్లయితే రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగాఉంటారని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనిరైతులకు రుణమాఫీ కాలేదనిఆయన అన్నారు. మీరు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోఇందిరాగాంధీ ఇచ్చిన ఇండ్లు భూములు దళితులు అందరికీ అందుబాటులో ఉన్నాయి. ఇందిరాగాంధీ ఆయంలో ఉన్నటువంటి హామీలుఇప్పుడు సోనియాగాంధీ ఆదివారం లోపల లేకపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దానిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నటువంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికూడా తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఇండ్లు బొమ్మలు ఇవ్వాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యా రేవంత్ రెడ్డి గత పది సంవత్సరాల జీతం ఉన్నటువంటి వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి పేద ప్రజలను ఆదుకున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం. మరి ఇప్పుడు ఎందుకు 11వ లేదో మీరే ఆలోచించవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. చేదోడు వాదోడుగా ఉన్నటువంటి టిఆర్ఎస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. వారి దృష్టిలో పెట్టుకొని ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందనికాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం 150 సంవత్సరాల ఆధ్వర్యంలో ఉన్నటువంటి మాట తప్పని కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలను ఆదుకోవాలనిఆయన అన్నారు.శంకరపల్లి మండల పరిధిలోని దళిత పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండాలనిఆయన కోరినారు.

## మరో రెండు రోజులు ఈ రాష్ట్రాల్లో వర్షాలు.. ఐఎండీ హెచ్చరిక

దేశవ్యాప్తంగా రుతుపవనాలు వెనక్కి తగ్గినప్పటికీ ఇంకా పలు రాష్ట్రాల్లో(%తీఖఱఅం%) మాత్రం వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అక్టోబరు 7 నుంచి 11వ వరకు ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో ఢిల్లీ, నోయిడా, ఫరీదాబాద్‌తో సహా లోని వివిధ ప్రాంతాలలో చిరుజల్లులు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వెంబడి వాయుగుండం కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో యూపీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో దీని ప్రభావం కనిపిస్తుందని వెల్లడించింది. పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ ప్రభావం అక్టోబర్ 7, 8 తేదీల్లో యూపీ, బీహార్‌లోని కొన్ని జిల్లాల్లో కనిపిస్తుందని ఐఎండీ వెల్లడించింది. దీంతోపాటు అక్టోబర్ 7 నుంచి 10 మధ్య ఆగ్నేయ అరేబియా సముద్రం మీదుగా కేరళ తీరం చుట్టూ, లక్షద్వీప్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, కర్ణాటక ప్రాంతాల్లో కూడా వర్షాలు కురియనున్నట్లు వెదర్ రిపోర్ట్ తెలిపింది. నైరుతి బే, ఉత్తర బెంగాల్, తమిళనాడు తీరానికి సమీపంలో బలమైన గాలులు వీస్తాయని చెప్పింది. ఇది కాకుండా గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది

## ఆదివారం నిజామాబాదు డి జె షాప్ ల యాజ మాన్యం నిజామాబాదు పోలీస్ కమీషనర్ గారిని కలిసి వినతి పత్రం సమర్పించారు.



నిజామాబాద్ జిల్లా (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ఈ సందర్భంగా సి పి మాట్లాడుతూ డి జె షాప్ ల వారు ఈ నెల 30 వరకు లైసెనుసులు , పర్మిషన్లు తప్పకుండ తీసుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల మరియు ఇతర జిల్లాల నుండి వచ్చే డి జె లను పూర్తిగా నిషేధం విధించడం జరిగింది. పోలీస్ శాఖ ఇచ్చినటువంటి ఆదేశాలు పాటిస్తూ ప్రజలకు, సీనియర్ సిటిజన్స్ కు, పిల్లలకు ఇబంధులు కలుగకుండా చట్ట పరిధిలో రెండు సౌండ్ బాక్స్ సిస్టమ్ లు వాడుతు ఈ కార్యక్రమము జరుపుకోవాలని తెలియజేసారు. ఇతర జిల్లాలు మరియు రాష్ట్రాల నుండి పర్మిషన్ లేకుండా వచ్చే డి జె లను ప్లే చేయడానికి పూర్తిగా నిషేధం విధించడం జరిగింది. డి జె షాప్ ల యాజమాన్యం ఇతర జిల్లాలు మరియు రాష్ట్రాల నుండి వస్తున్నటువంటి డిజే సిస్టమ్లను నిజామాబాదు జిల్లా వాతావరణం మరియు సౌండ్ సిస్టమ్ బిజినెస్ యాజమాన్యం ను ఇబంధులు కలిగిస్తున్నారని తెలిపారు.ఇతర జిల్లాలు మరియు రాష్ట్రాల నుండి వచ్చి నిజామాబాదు లో ఇబంది పెడుతునటువంటి డిజె వాళ్ళ పై చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. నిజామాబాదు జిల్లా డి జె అసోసియేషన్ వారు పూర్తి గా సహకరిస్తాము అని హామీ ఇవ్వడం రిగింది. పోలీస్ శాఖ పరిమితులకు లోబడి డి జె యాజమాన్యం వ్యవహారించాలని తెలిపారు.

## థర్మల్ ప్లాంట్‌ను జెన్‌కో ద్వారా నిర్మించాలి....

-సమత సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ .....



రామగుండం (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : రామగుండం థర్మల్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెన్‌కోకు చెందిన ఈ పవర్‌ప్లాంట్‌ను మూసివేసి, 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించి, ఆ సంస్థతో విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించు కోవాలన్నారు. కొత్తగా నిర్మించే థర్మల్, జల, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను జెన్‌కో ద్వారానే నిర్మించాలని ఆయన కోరారు. జెన్ కో ద్వారా థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తే 2,500 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. సింగరేణి సంస్థలో 49 శాతం కేంద్రం వాటా ఉందని.. జెన్ కో మాత్రం నూరు శాతం రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థను బలోపేతం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు తక్కువ ధరకే కరెంట్ లభించి ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సోమనపల్లి గ్రామ శాఖ అధ్యక్షునిగా ఉప్పులేటి కుమారస్వామి ఎన్నిక...



రామగుండం (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : అంతర్గాం మండలం సోమనపల్లి గ్రామంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సోమనపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం సోమనపల్లి గ్రామంలోని కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపెల్లి బాపయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అంబేద్కర్ ఆశయాలను గ్రామ గ్రామాన తీసుకెళ్లేందుకు, అంబేద్కర్ యువజన సంఘం కమిటీ లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఉప్పులేటి కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఉప్పులేటి సాగర్, ఉప్పులేటి రమేష్, కోశాధికారి పెగడపల్లి చిన్న, కార్యదర్శులుగా ఉప్పులేటి నర్సయ్య, అధికార ప్రతినిధిగా మల్కళ్ళ ప్రసాద్ ను ఎన్నుకున్నారు. ఈ సమావేశం కు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అంతర్గాం మండల ఇంచార్జ్ ఉప్పులేటి పవన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దళిత సామాజిక హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు చిలక ప్రసాద్, సీనియర్ దళిత సంఘాల నాయకులు కోరే శంకర్, మద్దిర్యాల మాజీ సర్పంచ్ భూపెల్లి లతా రాజేష్ ,అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఉప్పులేటి నరేష్, ముల్కల్ల భీమయ్య, ఉప్పులేటి శ్రీనివాస్, ఉప్పులేటి శంకర్, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తి పాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా - కేంద్రమంత్రి పెమ్మసాని



కాకుమాను (అక్టోబర్ 06 జనం రిపోర్టర్) : ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి పెమ్మసాని.చంద్రశేఖర్ అన్నారు.మండల కేంద్రం కాకుమాను గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అధ్యక్షతన ప్రారంభమైన కార్యక్రమం. దళితుల కాలనీలో స్థానికుల కోరిక మేరకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం తన సొంత నిధులను ఇస్తానని హామీ ఇచ్చిన పెమ్మసాని . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నిధులు లేకపోయినా సరే ఆర్‌బి అధికారులతో మాట్లాడిన పెమ్మసాని చొరవతో కాకుమాను మండల అభివృద్ధి నిమిత్తం రూ. 5.62 కోట్ల నిధులు కేటాయించబడ్డాయి అన్నారు. ఇవేగాక ప్రతి మండలానికి రూ. 60 లక్షల నిధులను రోడ్ల నిర్మాణం నిమిత్తం కేటాయించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇంకా అక్కడక్కడ కొందరు అధికారులు వైసీపీ వాసన నుంచి బయటపడటం లేదు. మా ప్రజలను, నాయకులను, కార్యకర్తలను ఎవరైనా ఇబ్బంది పెట్టాలని చూస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తొలగింపు చేసేందుకు ప్రత్యేక అడ్వకేట్లను నియమించుకొని మరీ కేసులు తీసివేసేందుకు పెమ్మసాని కృషి చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, వందనాదేవి, జనసేన ఇంచార్జ్ నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు నువ్వుల.సునీల్ చౌదరి,మాజీ యం.పి.పి మామిల్లపల్లి.రామ్ గోపాల్ , సంఘం డైరీ మాజీ చైర్మన్ కొల్లా.వీరయ్యచౌదరి, టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు రెండ్రోజుల ఢిల్లీ టూర్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు(సోమవారం) ఉదయం ఆయన ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఈసారి రెండ్రోజులపాటు పర్యటన సాగనుంది. ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధాని మోదీ సహా పలువురు మంత్రుల దృష్టికి మరోసారి సీఎం తీసుకువెళ్లనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు సహా పోలవరం ప్రాజెక్టుపై కీలక చర్చలు జరగనున్నాయి. ఇప్పటికే చంద్రబాబు పలుమార్లు ఢిల్లీ పెద్దలను కలిసి ఇవే అంశాలను ప్రస్తావించారు. అందులో భాగంగా మరోసారి వెళ్లి వారి ముందు కీలక అంశాలపై ప్రతిపాదనలు పెట్టనున్నారు.

చర్చించే అంశాలు ఇవే..

ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. ముందుగా సోమవారం సాయంత్రం 4:30గంటలకు ప్రధాని మోదీతో ఏపీ సీఎం సమావేశం అవుతారు. బుడమేరు వరదల అనంతరం చంద్రబాబు తొలిసారిగా ప్రధానిని కలుస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుడమేరు పొంగి ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, నష్టంపై ప్రధానికి నివేదిక ఇవ్వనున్నారు. వరద సహాయం నిధులు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విశాఖ ఉక్కు విలీనం వంటి పలు కీలక అంశాలను ప్రధాని ఎదుట చంద్రబాబు పెట్టనున్నారు. అలాగే అమరావతికి ప్రపంచ బ్యాంకు నుంచి ఇప్పిస్తామన్న రూ.15వేల కోట్లపైనా చర్చించే అవకాశం ఉంది. నిధులు విడుదలకు ఎలాంటి ఆంటకం లేకుండా ఉండేలా చూడాలని ప్రధానిని కోరే అవకాశం ఉంది. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మ్నెదటి విడత కింద ఇస్తామన్న రూ.12వేల కోట్ల గురించీ సీఎం మాట్లాడే అవకాశం ఉంది. మోదీని కలిసిన రోజే రైల్వే, సమాచార ప్రసారాల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన భేటీ అవుతారు. విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన ముహూర్తం సహా రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపైనా చర్చలు జరపబోతున్నారు. అలాగే మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం అవుతారు. అదే రోజు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లతో భేటీ కానున్నారు. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం రేపు, ఎల్లుండి రెండ్రోజులపాటు ఢిల్లీలో పర్యటించనున్నారు.

## నేడు 1635 మందికి ఉద్యోగ నియామక పత్రాలు: 9న 11 వేల మందికి ఇస్తామన్న రేవంత్



ఉద్యోగ నియామకాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు సీఎం రేవంత్ రెడ్డి. గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని సంవత్సరాల కొద్దీ సాగదీసిందని, నోటిఫికేషన్ల దశలోనే కొన్నేళ్లపాటు ఉంచారని మండిపడ్డారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఆదివారం ఏర్పాటు చేసిన 'కొలువుల పండగ'కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 1635 మందికి నియామక పత్రాలు అందజేశారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవిష్యత్తులో ఇంజినీర్లది కీలక పాత్ర అని అన్నారు. 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ ఇంజినీర్ల చేతుల మీదుగానే నిర్మాణం కాబోతున్నాయన్నారు. ఎయిర్ పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణం కాబోతున్నాయని రేవంత్ తెలిపారు. 55 కి.మీ మూసీ రివర్‌డెవలప్ మెంట్ ప్రాజెక్టు పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెడతామన్నారు. మరోవైపు కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు రేవంత్ రెడ్డి. కేసీఆర్, ఆయన కుటుంబంలోని వారి ఉద్యోగాలు పోతేనే పేదలకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు చెప్పానని.. తాను చెప్పినట్లే కేసీఆర్ ఉద్యోగం పోయిందని, ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయని రేవంత్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలు లేక.. లక్షలాది మంది యువత నిరాశలో మునిగిపోయారన్నారు.

నిరుద్యోగుల వల్లే నేడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చి వారి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూసే విధంగా చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 9న సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో 11,063 టీచర్ల ఉద్యోగ నియామక పత్రాలు అందించబోతున్నామని సీఎం రేవంత్ చెప్పారు. వందేళ్ల అనుభవం ఒకవైపు ఉంటే.. పదేళ్ల దుర్మార్గం ఒకవైపు అంటూ బీఆర్ఎస్ గత పాలనపై విమర్శలు గుప్పించారు. విశ్వాసంతో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకుందామన్నారు.

# వంద రోజుల పాలనపై ప్రజల్లో సంతృప్తి

ప్రశంసించారు. గడిచిన వంద రోజుల ఎన్డీయే పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, రాబోయే రోజుల్లోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమిలో బీజేపీ జాతీయ సమన్వయకర్తగా పనిచేసిన ఆయన... శనివారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలన, ఆరు గ్యారెంటీల్లో కీలకమైనవి అమలు, ప్రజల భయాందోళనల తొలగింపు, గత ఐదేళ్లలో దోపిడీకి బాధ్యులలో కొందరిని జైలుకు పంపడం, ఇటీవల విజయవాడను వరదలు ముంచెత్తినప్పుడు చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేసిన విధానం తదితర అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి. రాజధాని అమరావతికి కేంద్రం భారీగా నిధుల కేటాయింపు, పోలవరం పూర్తి చేసేందుకు భరోసా, రాష్ట్రంలో కేంద్ర పథకాలు, అభివృద్ధి పనులకు ఆర్థిక సహకారంపైనా ఇద్దరు నేతల మధ్య చర్చకు వచ్చింది. తిరుమల ప్రసాదంలో కల్తీ అంశం ప్రస్తావనకు రాగా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిజానిజాలు తేల్చే పనిలో ఉందని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

# 'డీఎస్సీ-24' ఫలితాల విడుదల

- 245 పోస్టులకు 735 మంది ఎంపిక
- అక్టోబరు 4 వరకు సర్టిఫికెట్ల పరిశీలన
- 1:3లో ఎంపిక చేసిన అభ్యర్థులకు నేరుగా సమాచారం




కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో డీఎస్సీ-2024 ఫలితాలను విడుదల చేశారు. జిల్లాలో 224 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించనున్నాయి. గత జూలై నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. డీఎస్సీకి సంబంధించిన ప్రాథమిక కీని గత ఆగస్టు 13న విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించారు. సెప్టెంబర్ 6న ఫైనల్ కీని విద్యాశాఖ విడుదల చేయడంతో అభ్యర్థులు ఫలితాల కోసం నిరీక్షించారు. డీఎస్సీ నిర్వహించిన 55 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేయడంపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1:3 నిష్పత్తిలో మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి వారికి సమాచారాన్ని మొబైల్‌లో అందిస్తారు. మంగళవారం నుంచి నియామక ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

### ఫ జిల్లాలో 245 మందికి ఉపాధ్యాయ పోస్టులు

జిల్లాలో వివిధ కేటగిరీల్లో 245 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పండిట్ పోస్టుల్లో ఓపెన్ కేటగిరీలో 89, ఎస్సీ కేటగిరిలో 49, ఎస్టీలో 18, బీసీ-ఏలో 19, బీసీ-బీలో 12, బీసీ సీ-9, బీసీ-డిలో 8, బీసీ ఈలో నాలుగు, ఈడబ్ల్యూఎస్‌లో 17, స్పోర్ట్స్ కోటాలో ఒకటి, ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో 8, వికలాంగుల కోటాలో 2 మొత్తం 245 పోస్టులను భర్తీ చేస్తారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ మెరిట్ ఆధారంగా ఖాళీలను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఎస్జీటీ తెలుగు (లోకల్ బాడీ) 71 పోస్టులు, ఎస్జీటీ ఉర్దూ (గవర్నమెంట్) 20, స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) 18, స్కూల్ అసిస్టెంట్స్ (బయోసైన్స్) 19, స్కూల్ అసిస్టెంట్ (సోషల్) 14, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 13, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) 11, లాంగ్వేజ్ హిందీ 4, లాంగ్వేజ్ పండిట్ తెలుగు 3, పీఈటీ లోకల్ బాడీ 4, పీఈటీలు (తెలుగు, ఉర్దూ)7, బయోసైన్స్ (ఉర్దూ, తెలుగు) 2, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 3, హిందీ 6, మ్యాథ్స్ 3, ఫిజికల్ ఎడ్యుకేషన్ 6, సోషల్ 2, తెలుగు 6 మొత్తంగా 245 పోస్టులను ఈ డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు.

### ఫ నేటి నుంచి 4వరకు సర్టిఫికెట్ల పరిశీలన

జిల్లాలో డీఎస్సీ ఫలితాల్లో 1:3 నిష్పత్తిలో మెరిట్ ఆధారంగా ఎంపికయిన సమాచారం అందుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం నుంచి 6వ తేదీ వరకు పరిశీలిస్తారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (దన్గర్‌వాడీ-మంకమ్మతోట)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారమిచ్చామని, సమాచారం అందిన అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు 1 నుంచి 7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, దివ్యాంగుల సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌పై గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన రెండు జతల జిరాక్సు ప్రతులతో హాజరుకావాలని సూచించారు.

# ఎవ్వరినీ వదలను.. ఆ ప్రచారం చేసింది బీఆర్ఎస్ నేతలే..



హైదరాబాద్: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తనపై తప్పుడు పోస్టులు పెట్టింది బీఆర్ఎస్ నేతలేనని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో భాగంగా ఒక తమ్ముడిగా మంత్రి సురేఖకు కండువా కప్పానని, దాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుగా ప్రచారం చేశారని రఘునందన్ మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు తమ పార్టీ నేతలను కంట్రోల్ చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కేసులు పెట్టి కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. హైదరాబాద్ భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ రఘునందర్ రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.."తల్లి, అక్క, చెల్లి మధ్య ఉండే సంబంధంపైనా బీఆర్ఎస్ సోషల్ మీడియా సంస్కారహీనంగా పోస్టులు పెట్టింది. ఒక తమ్ముడిగా మంత్రి సురేఖను అడిగి మరీ నూలు పోగు దండ వేశా. అలాంటి దండను ప్రధాని మోదీ వచ్చినప్పుడూ వేశా. దీనిపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసింది. అక్కకు జరిగిన అవమానానికి తమ్ముడిగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నా. దీనిపై పోస్టులు పెట్టిన వారిని ఒక లాయర్‌గా కోర్టుకు ఈడుస్తా. పోస్టు పెట్టిన అకౌంట్ డీపీలో హరీశ్ రావు, కేసీఆర్ ఫొటో ఉంది. ఆ పార్టీ నేతలకు సోషల్ మీడియా మీద నియంత్రణ లేదా?. తప్పుడు ప్రచారం చేసిన వాళ్లు మీ వాళ్లు అయితే తీసుకొచ్చి పోలీసులకి అప్పగించండి. మీకు సంబంధం లేని, మీరు జీతం ఇవ్వని వ్యక్తులు అయితే ఫిర్యాదు చేయండి. ట్రోలింగ్ చేసిన వారి వివరాలు సేకరించి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశా. మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సురేఖ అక్క వస్తే చేనేత సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లాలని నూలు పోగు దండ అడిగి వేశా. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వచ్చి నాకు శాలువా కప్పారు. ఇంత సంస్కారహీనంగా, సభ్యత లేకుండా మాట్లాడతారని అనుకోలేదు. కేటీఆర్, హరీశ్ రావు దీనిపై స్పందించి సోషల్ మీడియాను కంట్రోల్ చేసి క్షమాపణ చెప్పాలి. హరీశ్ రావు తన ఫొటోలు వాడుకుని తప్పుడు ప్రచారం చేశారని అనుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వ్యక్తుల వ్యక్తిత్వ హననం చేయడం మంచిది కాదు. మహిళల మీద ఆ పార్టీకి గౌరవం లేదు. తెలంగాణ తొలి కేబినెట్‌లో మహిళలకు బీఆర్ఎస్ చోటే ఇవ్వలేదు. వేలాది మంది సమక్షంలో జరిగిన కార్యక్రమాన్ని బూతద్దంలో చూపించి విమర్శలు చేసే వారిని చూస్తే బాధనిపిస్తోంది. నా వల్ల అక్క సురేఖకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తూ విచారం వ్యక్తం చేస్తున్నా" అని అన్నారు.

# హైడ్రా, మూసీ ప్రాజెక్టులపై మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన




హైదరాబాద్: హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ కోసం చేపడుతున్న మార్కింగ్ ప్రక్రియపై బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శుభ్రమైన నీరు. వాయువు అందించడమే మూసీ ప్రాజెక్ట్, హైడ్రా లక్ష్యాలని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు వారు తీసుకున్న నిర్ణయాలను మరిచిపోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 2017లో బీఆర్ఎస్ హయాంలోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యిందని ఆయన ప్రస్తావించారు. కాలుష్య నివారణకు, రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని 2017 కార్పొరేషన్ ఏర్పాటు చేశారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. "బీఆర్ఎస్ హయంలోనే ఆక్రమణలు, అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయో తేల్చాలని చెప్పారు. బఫర్ జోన్ బౌండరీలు నిర్ధారణ చేయాలని ఆదేశించారు. అక్కడ ఉన్నవారిని పంపించాలని తీర్మానించారు. 2020లో కేటీఆర్ మంత్రిగా ఉండగా బఫర్ జోన్ నిర్ధారించి ఇళ్లు కూల్చాలని నిర్ణయించారు. 2021లో మరో మీటింగ్ పెట్టి అక్రమ కట్టడాలు కూల్చాలని ఆదేశించారు. 2022లో మరో మీటింగ్ పెట్టి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని చెప్పారు" అని పేర్కొన్నారు. "మూసీకి రెండు వైపులా 55 మీటర్లు రోడ్లు వేయాలని, 50 మీటర్లు బఫర్ జోన్‌గా గుర్తించాలని 2016లోనే జీవో 7 తీసుకొచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు కూల్చాలని చెప్పారు. లక్షా 50 వేల క్యూసెక్కుల కంటే ఒక్క క్యూసెక్కు ఎక్కువ వచ్చినా ప్రాణ నష్టం జరుగుతుందని 2019లో ఓ సర్వే తేల్చింది. ఆనాడు మీరు ఆలోచన చేస్తే మంచిది. ఈ రోజు మేము మంచి నీరు, గాలి ఇవ్వాలనుకోవడం తప్పా?. మంచి ఆలోచనతో పని చేపడుతున్నాం. సమస్యను జఠిలం చేసేలా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం, మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో ఆనాడు మీరు ఎందుకు కనికరం చూపలేదు. అధికారం పోయి ఏం చేయాలో తోచక బురద చల్లుతున్నారు. కింది స్థాయి అధికారులు పొరపాట్లు చేస్తే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం మాకు లేదు" అని మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ ఇచ్చారు.

# నేడు ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు.. ఐఎండీ అలర్ట్



వర్షాల ప్రభావంతో కీలక నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాతావరణ శాఖ సూచన ప్రకారం ఈ రాష్ట్రాలకు ఉపశమనం లభించింది. ఈ రాష్ట్రాలు ఈరోజు(సెప్టెంబర్ 29న) వర్షం నుంచి ఉపశమనం పొందుతాయి. ఇదే సమయంలో తమిళనాడుతో పాటు పుదుచ్చేరి, కేరళ, దక్షిణ కర్ణాటక, కోస్తా కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు వాతావరణ శాఖ ప్రకారం సెప్టెంబరు 29న రాజస్థాన్‌లోని కోట, ఉదయ్‌పూర్, భరత్‌పూర్ డివిజన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో జోధ్‌పూర్ డివిజన్‌లోని దక్షిణ ప్రాంతాలలో కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. సెప్టెంబరు 30 నుంచి రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షపాతం తగ్గుతుందని, ఉదయపూర్ డివిజన్‌లో మాత్రమే మేఘాలు స్థిరపడే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఆదివారం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రత 34 డిగ్రీల సెల్సియస్ , కనిష్ట ఉష్ణోగ్రత 24 డిగ్రీల సెల్సియస్‌గా ఉండి పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గండక్, కోసి, మహానంద తదితర నదుల్లో శనివారం నీటి ప్రవాహం గణనీయంగా పెరిగిందని బీహార్ జలవనరుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో ఇప్పటికే భారీ వర్షాల వరదలతో ప్రభావితమైన 13 జిల్లాల్లోని 16.28 లక్షల మందికి పైగా ప్రజల పరిస్థితి మరింత దిగజారుతుంది. కోసి నదిపై బీర్‌పూర్ బ్యారేజీ నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం 5.79 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత 56 ఏళ్లలో ఇదే అత్యధికమని, ఈ క్రమంలో కట్టలను రక్షించేందుకు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం కారణంగా, అనేక నదుల నీటిమట్టం పెరిగింది. అనేక జిల్లాలకు వరద ముప్పు ఏర్పడింది. ఉత్తరాఖండ్‌లో వర్షాల ప్రభావం ఇక్కడ ఉందని ఆ శాఖ తెలిపింది. నీటిమట్టం పెరగడంతో జిల్లాలో సహాయక శాఖతోపాటు స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది.

24 గంటల్లో ఏడుగురు మృతి

భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం గత 24 గంటల్లో ఉత్తరప్రదేశ్‌లో 27.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 75 జిల్లాల్లో 55 జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. గోండా, గోరఖ్ పూర్, బల రాంపూర్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 150 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. అధికారుల ప్రకారం గత 24 గంటల్లో కనీసం ఏడుగురు వర్షాలకు సంబంధించిన సంఘటనలలో మరణించారు. ఫతేపూర్‌లో వర్షాల కారణంగా ముగ్గురు వ్యక్తులు మరణించగా, ఘాజీపూర్‌లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. చిత్రకూట్, అయోధ్యలో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు సహాయ శాఖ అధికారులు తెలిపారు.

# ప్రజలకు మేలు చేసేలా మా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది



ఏపీడీలు, డీపీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ బదిలీల ప్రక్రియ మొదలయ్యే ముందు తన కార్యాలయం పూర్తి సమాచారం తీసుకుందన్నారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు కీలక పోస్టుల్లో కొంచెం అటూఇటుగా మారుతూ, ఆ ప్రాంతాలను తమ జాగీర్లుగా మార్చుకునే స్థితికి చేరానని పేర్కొన్నారు. పీఆర్, ఆర్డీ అధికారులకు మాత్రమే డ్వామా పీడీ, ఏపీడీ, జడ్పీ సీఈఓ పోస్టులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, అందువల్ల ఇతర శాఖల నుంచి ఈ శాఖల్లోకి రావాలనుకున్న వారిని తీసుకోలేదన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఇంత పారదర్శకంగా, లంచాలకు ఆస్కారం లేకుండా ఇటీవల సంవత్సరాల్లో బదిలీలు జరగలేదని, బదిలీ తీరుపై ఉద్యోగుల నుంచి, మీడియా నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.

### గత ప్రభుత్వంలో దారిమళ్లిన నిధులు

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆశ్రిత పక్షపాతం లేకుండా, ప్రజలకు మేలు చేసేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత పాలకులు పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. జల్‌జీవన్ మిషన్ నిధులను గత పాలకులు సద్వినియోగపరచలేదన్నారు. కేంద్రం మన రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోపే కేంద్రం నుంచి రూ.4,500 కోట్లు ఉపాధి నిధులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొందిందని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,987 కోట్లు వచ్చాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా 2027 నాటికి 95.44 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా రక్షిత నీరు నిరంతరాయంగా సరఫరా చేయాలనేది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల లక్ష్యమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళిక కోసం మన రాష్ట్రానికి రూ.215 కోట్ల బడ్జెట్‌ను కేంద్రం ద్వారా ఆమోదింపచేసుకున్నామన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చురుగ్గా, లక్ష్యాన్ని అందుకునేలా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విరుద్ధంగా వెళ్లే అధికారులకు స్థానం చలనం ఉంటుందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో, రాష్ట్ర అభివృద్ధి కోసం తమ శాఖల సమీక్షలో, జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చేసిన సూచనలు విలువైనవని, వాటి ఆధారంగానే పంచాయతీలకు పునరుజ్జీవం చేస్తున్నామన్నారు.

# చరిత్రలో 1948, సెప్టెంబర్ 17 గురించి డిప్యూటీ సీఎం ఏం చెప్పారంటే...



ఖమ్మం, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉందని తెలిపారు. 76 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ, నాటి హైదరాబాద్ సంస్థానం రాజుల పాలన నుంచి భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య ప్రజాపాలన దశలోకి పరివర్తన చెందిందని తెలిపారు.

### తిరుమలలో ఏర్పాట్లపై మంత్రికి భక్తుడి ఫిర్యాదులో ట్విస్ట్.. అసలేం జరిగిందో చెప్పిన ఈవో

తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందన్నారు.

### 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు..

చివరి వరుసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందించడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గ్యారెంటీ పథకాలను అందించే దిశగా జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాలు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం చెప్పారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే అమలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. ఆడ బిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్రంలో 87.12 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు. ఉచిత ఆర్టీసీ పథకం ద్వారా మహిళలకు 2958 కోట్ల రూపాయలు ఆదా చేయగలిగామన్నారు. ఈ పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో మహిళలకు దాదాపు 1,79,97,210 పైగా జీరో టికెట్లను జారీ చేశామని.. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు దాదాపు 8432.83 లక్షల రూపాయలను ఆదా చేశారని చెప్పారు.

### ఏ సమయానికి నిమజ్జనాలు పూర్తవుతాయో చెప్పిన డీజీపీ

### రూ.500 కే వంటగ్యాస్ సిలెండర్

రూ. 500 కే వంటగ్యాస్ సిలెండర్ పంపిణీ ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మి పథకంలోని మరో పథకం 500 రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వాలన్న ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రారంభించామన్నారు. 40 లక్షల మంది లబ్ధిదారులతో మొదలైన ఈ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 42.90 లక్షల మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 94 వేల 753 మంది వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను సబ్సీడిపై సరఫరా చేసి సంబంధిత లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలలో 1119.71 లక్షల రూపాయలు సబ్సిడీ సొమ్ము జమ చేశామన్నారు.

### ప్రతీ ఇంటికి ఉచిత వెలుగులు..

గృహజ్యోతితో పేదల ఇంట వెలుగులు అల్పాదాయ వర్గాలవారికి విద్యుత్ బిల్లుల భారం తగ్గించి, వారి గృహాలలో చీకట్లను పారద్రోలి, విద్యుత్ కాంతులను నింపేందుకు గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతి ఇంటికి ఉచిత వెలుగులు పంచుతున్నామన్నారు. ఈ పథకాన్ని 2024 మార్చిలో ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలో 48 లక్షల 62 వేల 682 మంది గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. 2024 మార్చి 1 నుంచి ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 2,57,995 వినియోగదారులకు నెలకు రూ. 9.48 కోట్ల సబ్సీడి చొప్పున ఆగస్టు 2024 వరకు రూ. 49.97 కోట్లు సబ్సీడీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ ఎటువంటి కోతలు లేకుండా అన్ని రంగాల వారికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# రైతుల కాళ్లను గోదావరి జలాలతో కడిగేది కాంగ్రెస్సే



రైతన్నల కన్నీళ్లను తుడిచి గోదావరి జలాలతో వారి కాళ్లను కడిగేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం గోదావరి జలాలతో ప్రవహిస్తున్న ఆలేరు పెద్ద వాగులో గంగమ్మకు నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత స్థానిక దుర్గామాత ఆలయంలో దుర్గాదేవిని దర్శనం చేసుకున్నారు.

### రైతుల కాళ్లను గోదావరి జలాలతో కడిగేది కాంగ్రెస్సే ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, సెప్టెంబరు 30: రైతన్నల కన్నీళ్లను తుడిచి గోదావరి జలాలతో వారి కాళ్లను కడిగేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం గోదావరి జలాలతో ప్రవహిస్తున్న ఆలేరు పెద్ద వాగులో గంగమ్మకు నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత స్థానిక దుర్గామాత ఆలయంలో దుర్గాదేవిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల్లోనే ఆలేరుకు గోదావరి జలాలు రప్పించామన్నా రు. రైతన్నలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, తపాసపల్లి, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా నీళ్లు తెచ్చిన ఘనత కాంగ్రెసదే అన్నారు. దీంతో యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, ఆలేరు, గుండాల, ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల చెరువులు నిండనున్నాయన్నారు. జల యజ్ఞం పేరుతో ధన య జ్ఞం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే దుర్మార్గంగా మాట్లాడుతున్నారని, ఆలేరు దుర్గమ్మ సాక్షిగా ప్రమాణం చేసి నీళ్లను ఎవరు తెచ్చారో ప్రతిపక్షాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రాజు, ఎం.ఏ.ఎజాజ్, బాల్‌రాజ్, తుంగ కుమార్, గాదె సోమిరెడ్డి, ప్రకాశ్, సురేషగౌడ్, సాగర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్ విజయ్‌కుమార్, భాస్కర్, పద్మ, వెంకట స్వామి, విక్రమ్, అజయ్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

యాదగిరిగుట్ట రూరల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం గుట్ట మం డలంలోని ధర్మారెడ్డిగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి స్థల దాన శ్రీనివాసరెడ్డిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాలకు దాతలు సహకరించినప్పుడే మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించారని, రేషన్ల కార్డులు లేనికివారికి డిజిటల్ కార్డు లు మంజూరు చేస్తామన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి గోదావరి జలాలు నాలుదిక్కుల వస్తాయన్నారు. రూ.2లక్షల రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని టెక్నికల్ సమస్యలు ఉండి మాఫీ కాని రైతులు ఆయా మండలాల వ్యవసాయ అ?ధికారులను సంప్రదించాలన్నారు. అంతకుముందు మల్లాపురం, సైదాపురం చెరువులకు వదిలిన నీటిని పరిశీలించారు. సైదాపురం వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, కలకుంట్ల సరితశేఖర్, సుగుణరాంరెడ్డి, మంగ సత్యనారాయణ, గుండ్లపల్లి భరత్‌గౌడ్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ శ్రీనివాసగౌడ్, కళ్లెం శ్రీనివాసగౌడ్, ఆరె.వెంకట స్వామిగౌడ్, రైతు సంఘం నాయకుడు కొల్లూరి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలి..

సీపీఐ..




ఎమ్మిగనూరు : విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ శనివారం రోజున సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా అధ్యక్ష వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి జి.రంగన్న,సిపిఐ మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు,ఇతర భారాలను భరించలేకే గత ప్రభుత్వాన్ని ఇంటికి పంపడం జరిగిందని,కానీ టిడిపి కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచబోమని పొందుపరిచి అధికారంలోకి రావడం జరిగిందని,కానీ ఆ హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారీగా మోపెందుకు కూటమి ప్రభుత్వం పూకొంటుందని వారు తెలిపారు.2022-2023 సంవత్సరానికి 8,113 కోట్ల భారాన్ని వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలికి నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని వారు తెలిపారు.ఈ కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యవసర ధరలు ఆకాశానంటాయని ,పండుగ దినాలలో ప్రజలు పస్తులు ఉండే పరిస్థితి దాపరించిందని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రజలపై భారాలు మోపడం సరికాదని వారు తెలిపారు. కాబట్టి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలపై అనవసర విద్యుత్ సర్దుబాటు చార్జీలను మోపకుండా తక్షణమే ఆ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో మరో బషీర్బాగ్ విద్యుత్ పోరాటాన్ని లేవనెత్తుతామని వారు రాష్ట్ర కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దాదావలి,కేసి జబ్బర్,బిజీ. విరూపాక్షి నాయుడు,వీరేష్,తిమ్మ గురుడు, విజయేంద్ర, రామాం జనేయులు, కాజా, మల్లికార్జున గౌడ్, ఇస్మాయిల్, అల్లా బకాష్,మన్సూర్, హనుమంతు,నరసింహులు, రవి,ఆంజనేయ,షరీఫ్, ఇస్మాయిల్, వీరేంద్ర, గోపాల్, శ్రీరామ్,అజారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు

## సీఎం చంద్రబాబు ఔదార్యం..

- క్యాన్సర్ బాధితుడికి రూ.5 లక్షల సాయం..



గుంటూరు :తిరుమల టూర్ ముగించుకుని రేణిగుంట విమానాశ్రయానికి కు చేరుకున్న సీఎం చంద్రబాబును పలువురు టీడీపీ నాయకులు,కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన అందరితో సరదాగా కాసేపు ముచ్చటించారు.అనంతరం లివర్ క్యాన్సర్‌తో బాధపడుతోన్న పసుపులేటి సురేంద్రకు సీఎం రూ.5 లక్షల చెక్కును అందజేశారు.సురేంద్ర,చంద్రబాబు వీరాభిమాని కావడంతో ఆయనతో ఫొటో దిగాలనే కోరికను సీఎం కూడా నేరవేర్చారు.ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఇకపై మరింత పకడ్బందీగా 'ఉపాధి' పనులు..



తుగ్గలి :మండలంలోని అన్ని గ్రామాలలో ఇకపై మరింత పకడ్బందీగా ఉపాధి పనులను చేపడుతామని ఏపీఓ హేమసుందర్ తెలిపారు. ఇటీవల హాలహర్వి మండలం నుంచి బదిలీపై తుగ్గలి మండలానికి వచ్చి నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏపీఓ హేమచందర్ శనివారం తుగ్గలిలోని స్థానిక ఉపాధి కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి రైతుల పొలాలలో ఉపాధి పనులను గుర్తించి వారికి అనువుగా ఉండేలా వారి పొలాల్లో ఉపాధి పనులను చేపడతామన్నారు.అలాగే ఉపాధి సిబ్బంది కూడా ఇకపై ఉపాధి పనులలో నాణ్యత ప్రమాణాలు ఎంత మాత్రం లోపించకుండ ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వ్యవసాయ, రైతు కూలీలతో కలిసి పకడ్బందీగా చేపట్టాలని అలాగే గ్రామాలలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో కల్పించాలని ఉపాధి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

## నిండి పొంగి పొర్లుతున్న 'జొన్నగిరి' చెరువు



తుగ్గలి :మండల పరిధిలోని జొన్నగిరి గ్రామానికి చెందిన చెరువు ఎట్టకేలకు గత ఐదు సంవత్సరాల తర్వాత ఊహించని విధంగా ఇటీవల అధికంగా కురిసిన వర్షాల వల్ల నిండి పొంగి పొర్లుతోంది. దీంతో ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మిద్దె రవి కుమార్ యాదవ్, సంఘాల కృష్ణ, లక్ష్మణస్వామి, అంజి తదితరులు శనివారం ఆ చెరువు చివరి భాగంలో ఉన్న కదుగొమ్మ దగ్గర నిలువబడి ఆనందంతో హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది తమ గ్రామానికి చెందిన చెరువు పుష్కలంగా నిండి పొంగిపొర్లిపోవడంతో తమకేంతో ఆనందంగా ఉందని దీంతో తమ గ్రామానికి తాగు, నీటికి, రైతాంగానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## అన్నపూర్ణాదేవిగా 'దుర్గమ్మ' దర్శనం



తుగ్గలి దసరా మహా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం తుగ్గలి గ్రామంలోని స్థానిక జమ్మిచెట్టు దగ్గర అలాగే శ్రీరాముల దేవాలయం దగ్గర వేరువేరుగా అమ్మవారి కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవారు భక్తులకు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. దీంతో ప్రజలు భక్తాదులు అత్యంత భక్తిశ్రద్ధలతో అన్నపూర్ణాదేవీగా దర్శనమిచ్చిన దుర్గమ్మకు తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

- ఘనంగా వైష్ణవ ఫ్రెషర్స్ డే వేడుకలు



ఎమ్మిగనూరు విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని డీఎస్పీ ఉపేంద్ర కుమార్,పట్టణ సుదర్శన్ రెడ్డి,వైష్ణవి కళాశాలల గ్రూప్ చైర్మన్ జీడి లింగప్ప, వైష్ణవి అకాడమీ చైర్మన్ జి.విష్ణు ప్రభు పేర్కొన్నారు.శనివారం వైష్ణవి గ్రూప్ నిర్వహిస్తున్న ఇంటర్ డిగ్రీ ఎంబీఏ కళాశాల ల ఫ్రెషర్స్ డే వేడుకలు పట్టణంలోని వాసవి ఏసీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు ఎటువంటి అలవాటుకు గురికాకుండా మంచిగా ఉండాలని కోరారు.ఇవి టీజింగ్,తదితర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతంగా ఎదుగుతారన్నారు.ఫ్రెషర్స్ డే వేడుకలు సందర్భంగా కళాశాల విద్యార్థిని




విద్యార్థులు ధార్మిక జానపద సాంస్కృతిక సినీ పాటలకు వేసిన నృత్యాలు ఎంతో ఆకట్టు కున్నాయి. అలాగే నాటక దృశ్యాలు కూడా అలరించాయి. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ రెడ్డి,వైష్ణవి కళాశాల కరస్పాండెంట్ సత్య సిరి,వైష్ణవి కళాశాల డైరెక్టర్లు గంగన్న,జి కనకనిది, జి.జ్ఞాన సాయి కృతి, వైష్ణవి అకాడమీ కోఆర్డినేటర్ రవీంద్ర నాయక్ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మధుబాబు మునేప్ప సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పీజీ వైద్య విద్య ప్రవేశాలు ఎన్నడో?

**-ఇంకా నోటిఫికేషన్ ఇవ్వని ఆరోగ్య వర్సిటీ..**

**అఖిలభారత కోటాకు పూర్తయిన రిజిస్ట్రేషన్**

**-యూజీ ప్రవేశాల్లో బిజీగా ఉన్న హెల్త్ వర్సిటీ**

**-స్థానికత జీవోతో రాష్ట్ర విద్యార్థులకు నష్టం**

**-వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని మెడికోల విజ్ఞప్తి**

హైదరాబాద్,: రాష్ట్రంలో వైద్యవిద్య పీజీ ప్రవేశాలపై ఇంతవరకు స్పష్టత రాలేదు. హెల్త్ యూనివర్సిటీ నుంచి నోటిఫికేషన్ రాకపోవడంపై నీట్ పీజీ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీజీ ఆలిండియా కోటా సీట్లకు మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) ఇప్పటికే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. పీజీ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొంది. ఆలోగా మనదగ్గర కూడా ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇవ్వాలి. నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు డీమ్డ్, సెంట్రల్ వర్సిటీల్లో 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 50 శాతం సీట్లను ఆయా రాష్ట్రాల హెల్త్ వర్సిటీలు భర్తీ చేస్తుంటాయి. మిగతా అన్ని రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, లోకల్ మెరిట్ జాబితాను విడుదల చేశాయి. కానీ, మనదగ్గర ఇంతవరకు నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదని వైద్యవిద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. అలాగే నీట్ పీజీ మెరిట్ జాబితాను విడుదల చేయకపోవడంతో ఇతర రాష్ట్రాల్లో కౌన్సెలింగ్‌లో పాల్గొనాలా? వద్దా? అన్న విషయాన్ని తేల్చుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మన దగ్గర స్థానికత జీవో కారణంగా యూజీ ప్రవేశాల ప్రక్రియ చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. ఆ ప్రక్రియలో హెల్త్ వర్సిటీ బిజీగా ఉంటోందని, అందుకే పీజీ ప్రవేశాలపై స్పష్టత ఇవ్వలేదని వైద్యవర్గాలు వెల్లడించాయి.



### స్థానికత జీవోతో తీవ్ర నష్టం..

స్థానికత జీవో ప్రకారం.. ప్రస్తుతం వైద్యవిద్య ప్రవేశాలకు ముందు వరసగా నాలుగేళ్ల పాటు రాష్ట్రంలో చదివి ఉండాలి. అంటే పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో కేవలం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులే అర్హులవుతారు. తెలంగాణ స్థానికత ఉండి ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారంతా స్థానికేతరులుగా మారిపోనున్నారు. ఆలిండియా టాప్ ర్యాంకర్లు సహజంగా ఎయిమ్స్, జిప్‌మర్ లాంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో చదివేందుకు ఆసక్తి చూపుతారు. అండర్ గ్రాడ్యుయేషన్‌లో ఆలిండియా 15 శాతం కోటా కింద సీటు వస్తే దేశంలోని ఏ రాష్ట్రంలో సీటొస్తే అక్కడే వైద్యవిద్యను పూర్తిచేస్తారు.రాష్ట్రం నుంచి ఏటా 150-200 మంది విద్యార్థులు ఆలిండియా కోటా సీట్లకు పోటీ పడడమే కాకుండా.. ఎక్కడ సీటు వస్తే అక్కడికి వెళ్లి వైద్యవిద్యను పూర్తి చేసి వస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ తీసుకొచ్చిన తాజా స్థానికత జీవో ప్రకారం ఇప్పుడు వారంతా స్థానికేతరులుగా మారతారు. రాష్ట్రంలో పీజీ వైద్యవిద్యను అభ్యసించే అవకాశాన్ని కోల్పోతారు. అన్నింటికీ మించి అసలు దరఖాస్తు చేసుకునే అర్హత కూడా వారికి ఉండదు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 2548 పీజీ సీట్లున్నాయి. ఇందులో 1676 డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (ఎండీ), 848 మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఎంఎస్), 23 పీజీ డిప్లొమో సీట్లు ఉన్నాయి.

### వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలి: ఓ పీజీ అభ్యర్థి

కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తక్షణమే పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవకాశం కల్పించాలి. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో మెరిట్ జాబితాను కూడా విడుదల చేశారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా? అని హెల్త్ వర్సిటీ వెబ్‌సైట్‌ను చూస్తున్నాం. వర్సిటీకి ఫోన్ చేసినప్పటికీ ఎవరూ స్పందించడం లేదు. తక్షణమే వైద్య మంత్రి స్పందించి, నోటిఫికేషన్ విడుదలయ్యేలా చొరవ తీసుకోవాలి.

# టీటీడీలో రివర్స్ టెండరింగ్ రద్దు

-ప్రభుత్వాదేశాలతో ఈవో నిర్ణయం

-వైసీపీ హయాంలో రివర్స్ మంత్రం

-ఎలాంటి ప్రయోజనం లేని వైనం

-దీంతో రివర్స్‌కు కూటమి సర్కారు బ్రేక్

-కల్తీలు, నాసిరకం సరుకులకు చెక్



తిరుపతి, : రివర్స్ టెండరింగ్ విధానానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) స్వస్తి పలికింది. వైసీపీ హయాంలో అమలు చేసిన ఈ విధానం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీటీడీ ఈవో నిర్ణయం తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తొలుత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అనుసరించిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని ఇతర అన్ని శాఖలు, విభాగాలకు వర్తింపజేసిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో టీటీడీలో సైతం రివర్స్ టెండరింగ్ విధానాన్ని అనుసరించారు. అయితే.. ఈ విధానమే పలు విషయాలను వివాదాస్పదం చేసింది. ముఖ్యంగా కల్తీ నెయ్యి వెనుక రివర్స్ టెండరింగ్ విధానం ఉందని, నాసిరకం, కల్తీ వంటివి చోటు చేసుకోవడానికి ఇదే కారణమన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీటీడీలో కూడా ఈ నెల 1వ తేదీ నుంచి రివర్స్ టెండరింగ్ పద్ధతికి స్వస్తి పలికారు.

### 2020 నుంచి రివర్సే!

గత వైసీపీ ప్రభుత్వం నిధుల ఆదా పేరిట రివర్స్ టెండరింగ్ విధానాన్ని తెచ్చింది. దీనిలో భాగంగా 2020, ఆగస్టు 31 నుంచి టీటీడీలో కూడా ఈ పద్ధతిని అమలు చేశారు. రివర్స్ టెండరింగ్ వల్ల నిర్మాణ పనికి లేదా వస్తువుల కొనుగోలుకు కేటాయించే నిధుల మొత్తం తగ్గాలి. అయితే ఆ పని నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా జరగలేదు. ఈ విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా నిధులు ఆదా చేస్తున్నట్టుగా ప్రచారం చేసుకున్న అప్పటి ప్రభుత్వం నిజానికి ఇతర అడ్డదారుల్లో అసలుకే మోసం వచ్చేలా వ్యవహరించింది. సాధారణ టెండరింగ్ విధానంలో ఒక పనికి నిర్దేశించిన అంచనా వ్యయం కంటే రివర్స్ టెండరింగ్‌లో స్వల్ప తగ్గుదల ఉండాలి. కానీ, టీటీడీలో దానికి విరుద్ధంగా పనులు జరిగాయి. అంచనా వ్యయం తక్కువ చూపి నిధులు ఆదా చేస్తున్నట్టు ప్రచారం చేసుకున్న గత పాలకమండళ్లు, అధికారులు.. అసలు అవసరం లేని పనులు చేపట్టారు. స్విమ్స్‌లో నిక్షేపంగా ఉన్న భవనాలను పునరుద్ధరించడం, మరమ్మతులు చేపట్టడం దీనిలో భాగమే. పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన గోవిందరాజస్వామి సత్రాల విషయంలోనూ అలాగే వ్యవహరించారు. రూ.కోట్లు వెచ్చించి పునరుద్ధరించిన సత్రాలను కూల్చివేసి నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. శ్రీవాణి ట్రస్టు కింద చేపట్టిన నిర్మాణాలు, పునరుద్ధరణలు, మరమ్మతులు చాలా వరకు ఆరోపణలకు దారి తీశాయి. ఇక సామగ్రి, వస్తువులు, ముడిసరుకుల కొనుగోళ్లకు కూడా ఇదే విధానం అవలంభించడంతో నాణ్యత ప్రశ్నార్థకమైంది.

2020 నుంచి రివర్సే!

గత వైసీపీ ప్రభుత్వం నిధుల ఆదా పేరిట రివర్స్ టెండరింగ్ విధానాన్ని తెచ్చింది. దీనిలో భాగంగా 2020, ఆగస్టు 31 నుంచి టీటీడీలో కూడా ఈ పద్ధతిని అమలు చేశారు. రివర్స్ టెండరింగ్ వల్ల నిర్మాణ పనికి లేదా వస్తువుల కొనుగోలుకు కేటాయించే నిధుల మొత్తం తగ్గాలి. అయితే ఆ పని నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా జరగలేదు. ఈ విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా నిధులు ఆదా చేస్తున్నట్టుగా ప్రచారం చేసుకున్న అప్పటి ప్రభుత్వం నిజానికి ఇతర అడ్డదారుల్లో అసలుకే మోసం వచ్చేలా వ్యవహరించింది. సాధారణ టెండరింగ్ విధానంలో ఒక పనికి నిర్దేశించిన అంచనా వ్యయం కంటే రివర్స్ టెండరింగ్‌లో స్వల్ప తగ్గుదల ఉండాలి. కానీ, టీటీడీలో దానికి విరుద్ధంగా పనులు జరిగాయి. అంచనా వ్యయం తక్కువ చూపి నిధులు ఆదా చేస్తున్నట్టు ప్రచారం చేసుకున్న గత పాలకమండళ్లు, అధికారులు.. అసలు అవసరం లేని పనులు చేపట్టారు. స్విమ్స్‌లో నిక్షేపంగా ఉన్న భవనాలను పునరుద్ధరించడం, మరమ్మతులు చేపట్టడం దీనిలో భాగమే. పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన గోవిందరాజస్వామి సత్రాల విషయంలోనూ అలాగే వ్యవహరించారు. రూ.కోట్లు వెచ్చించి పునరుద్ధరించిన సత్రాలను కూల్చివేసి నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. శ్రీవాణి ట్రస్టు కింద చేపట్టిన నిర్మాణాలు, పునరుద్ధరణలు, మరమ్మతులు చాలా వరకు ఆరోపణలకు దారి తీశాయి. ఇక సామగ్రి, వస్తువులు, ముడిసరుకుల కొనుగోళ్లకు కూడా ఇదే విధానం అవలంభించడంతో నాణ్యత ప్రశ్నార్థకమైంది.

# కర్చీఫ్ వేస్తే కుదరదు

(అమరావతి ఆమోదం పొందిన ఐదేళ్ల లోగా విద్యుత్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిందే! ఒకవేళ ఆ గడువులోగా పూర్తి చేయకపోతే .. అనుమతులన్నీ రద్దయిపోతాయి. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం తీసుకురానున్న 'క్లీన్ ఎనర్జీ' పాలసీలో షరతు విధించనున్నారు. ఈ నెల పదో తేదీన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో క్లీన్ ఎనర్జీ పాలసీని ఖరారు చేయనున్నారు. ఇంధనోత్పత్తి సంస్థలకు ప్రోత్సాహకాలను అందిస్తూనే, కాలవ్యవధిలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని ఈ పాలసీలో స్పష్టం చేయనున్నారు. ఇప్పటికే క్లీన్ ఎనర్జీ ముసాయిదా విధానాన్ని ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా ఆమోదించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తేలా ఈ పాలసీని తయారు చేయాలని ఇంధనశాఖను చంద్రబాబు ఆదేశించారు. నిజానికి, గత ఐదేళ్లలో సంప్రదాయేతర ఇంధన రంగంలో ఇష్టారాజ్యం సాగింది. అస్మదీయులకు నాటి జగన్ ప్రభుత్వం భారీగా ప్రాజెక్టులు కట్టబెట్టింది. కానీ, అవేవీ కార్యరూపం దాల్చలేదు. 5,287 మెగావాట్ల పవన, 12,075 మెగావాట్ల సోలార్, 17,055 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ యూనిట్లను అస్మదీయ ఇండోసోల్, షిరిడీ సాయి, అదానీ వంటి సంస్థలకు కట్టబెట్టింది. వేలాది ఎకరాలను కూడా కేటాయించింది. పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుల కోసం రిజర్వాయర్లకు సమీపంలోనే భూములను అప్పగించింది. ఈ పనులేవీ గడచిన ఐదేళ్లలో ముందుకు సాగలేదు. మొదట దరఖాస్తు చేసుకున్నవారికి మొదటి ప్రాధాన్యం అనే విధానాన్ని నాటి జగన్ ప్రభుత్వం అవలంభించింది. వాస్తవానికి కేంద్ర మార్గదర్శకాల మేరకు .. పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టులను రివర్స్ టెండర్ విధానంలో కేటాయించాలి. పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుల కేటాయింపుల విషయంలో కేంద్రం ఆదేశాలను తుంగలోకి తొక్కి తన అస్మదీయులకు నేరుగా ప్రాజెక్టులను నాడు జగన్ అప్పగించేశారు.



భూములు పొందినవారంతా .. ప్రాజెక్టులను నిర్మించేందుకు శ్రద్ధ చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రాష్ట్రంలో సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో పది లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఏడున్నర లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ పాలసీని తీసుకువస్తోంది.్లన్ ఎనర్జీ పాల

రాష్ట్రంలో సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థల స్థాపనకు సరళీకృత విధానాలు

క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను ప్రోత్సహించడం సహజ విద్యుత్తు, సంప్రదాయేతర ఇంధనోత్పత్తిని బ్యాలెన్సు చేసుకుంటూ గ్రిడ్‌పై భారం పడకుండా సమన్వయం చేసుకోవాలి. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తుల పరికరాల తయారీకి ప్రోత్సాహం క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్ - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పునరుద్పాదక విద్యుత్తు సంస్థలకు ప్రోత్సాహకంగా కేటాయించే భూములకు స్టాంప్ డ్యూటీ, భూ బదలాయింపు ఫీజు మినహాయింపు ఎస్‌జీఎస్టీ రీ యింబర్స్‌మెంట్ చేస్తారు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయింపు రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల పొడవైన సముద్రతీర ప్రాంతాన్ని సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల స్థాపనకు వినియోగించుకోవాలి. మొత్తంగా 78.50 గిగావాట్ సోలార్, 35 గిగావాట్ విండ్, 22 గిగావాట్ పంప్డ్ స్టోరేజీ, 25 గిగావాట్ బ్యాటరీ స్టోరేజీ ఉత్పత్తేలక్ష్యం. ఏటా 1.50 మిలియన్ మెట్రిక్ టన్ను గ్రీన్ హైడ్రోజన్ ఇంధనం, రోజుకు 1000 టన్నుల బయో ఫ్యూయల్స్ వాడకం ఉండేలా చర్యలు.

## ఏపీజేఎఫ్ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు గా ఎంపికైన కేఎండి.ఫరూక్,హరనాథ్ రెడ్డీ..



ఎమ్మిగనూరు :ఏపీజేఎఫ్ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా కే.ఎండి.ఫరూక్,హరనాథ్ రెడ్డీ ఎంపికయ్యారు.ఈ మేరకు ఏపీజేఎఫ్ బలోపేతం కు కృషి చేసినందుకు కేఎండి.ఫరూక్ కు రాష్ట్ర ఏపీజేఎఫ్ జనరల్ సెక్రెటరీ మారేళ్ల వంశీ కృష్ణ ( మహా న్యూస్ ఎండి ) ప్రశంసా పత్రం అందించారు.విజయవాడలో ని పున్నమి ప్రభుత్వ గెస్ట్ హౌస్ లో ఏపీజేఎఫ్ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఏపీజేఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు రాష్ట్ర ఏపీజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెవుల కృష్ణ ఆంజనేయులు నేతృత్వంలో రాష్ట్రంలోని ప్రముఖ ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల యాజమాన్యాలు, ప్రముఖ జర్నలిస్టులు రాష్ట్ర ఏపీజేఎఫ్ కమిటీ నేతలు పాల్గొన్నారు.



## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి.

- ఘనంగా వైష్ణవి కాలేజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు.



ఎమ్మిగనూరు, : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని డీఎస్పీ ఉపేంద్ర కుమార్, పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి, వైష్ణవి కళాశాలల గ్రూప్ చైర్మన్ జీడి లింగప్ప, వైష్ణవి అకాడమీ చైర్మన్ జి విష్ణు ప్రభు పేర్కొన్నారు. శనివారం వైష్ణవి గ్రూప్ నిర్వహిస్తున్న ఇంటర్ డిగ్రీ ఎంబీఏ కళాశాల ల ఫ్రెషర్స్ డే వేడుకలు పట్టణంలోని వాసవి ఏసీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎటువంటి అలవాటుకు గురికాకుండా మంచిగా ఉండాలని కోరారు. ఇవి టీజింగ్, తదితర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఫ్రెషర్స్ డే వేడుకలు సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ధార్మిక జానపద సాంస్కృతిక సినీ పాటలకు వేసిన నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే నాటక దృశ్యాలు కూడా అలరించాయి. ఈ కార్యక్రమంలో వైష్ణవి కళాశాల కరస్పాండెంట్ సత్య సిరి, వైష్ణవి కళాశాల డైరెక్టర్లు గంగన్న, జి కనకనిది, జి. జ్ఞాన సాయి కృతి, వైష్ణవి అకాడమీ కోఆర్డినేటర్ రవీంద్ర నాయక్ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మధుబాబు మునేప్ప సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



